

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

తిరుపతి, చంద్రగిరి, రేణిగుంట	: 99854 38368
చిత్తూరు, పూతలపట్టు, గంగాధర నెల్లూరు	: 99854 10940
పలమనేరు, కుప్పం, పుంగనూరు	: 97036 18724
మదనపల్లి, పీలేరు, తంబళ్లపల్లి	: 99854 22298
శ్రీకాళహస్తి, పుత్తూరు, నగరి, సత్యవేడు	: 99890 59755

దంచి కొట్టిన వాన

ఎస్ఆర్‌పురంలో 15.4, నింద్రలో 14 సెం.మీ వర్షం



గుడిపాల మండలం గోళ్లతిమ్మయ్య కండ్రిగ గ్రామ సమీపంలో కొట్టుకుపోయిన వంతెన

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకు పలుచోట్ల విస్తారంగా వర్షాలు కురిసాయి.రొంపిచెర్ల మినహా 31 మండలాల్లో వర్షాలు కురిసాయి.అత్యధికంగా శ్రీరంగరాజపురంలో 154.0 మిమీ, నింద్రలో 140.2 మిమీ వర్షం కురిసింది. రామకుప్పం మండలంలో అత్యల్పంగా 4.8 మిమీ వర్షం మాత్రమే కురవగా..గుడిపాలలో 93, కుప్పంలో 89, నగరిలో 86.2, పూతలపట్టులో 80.2, బంగారుపాళ్యంలో 78.6, చిత్తూరులో 78, బైరెడ్డిపల్లిలో 76.2, యాదమరిలో 64, పాలసముద్రంలో 59.2, పెనుమూరులో 55, గంగాధరనెల్లూరులో 54.2, చిత్తూరు అర్బన్‌లో 46.4, గంగవరంలో 45.6, పుంగనూరులో 42.4, విజయపురంలో 42.2, పలమనేరు, కార్వేటినగరం మండలాల్లో 41.8, పెద్దపంజాణిలో 32.6, చౌడేపల్లిలో 30, గుడుపల్లెలో 28.8, శాంతిపురంలో 26.4, సోమలలో 23.6, పులిచెర్లలో 23.2, తవణంపల్లెలో 20.2, వి.కోటలో 19.4, ఐరాల, సదుంలలో 15.4 మిమీ చొప్పున వర్షపాతం నమోదయ్యింది.దీంతో చలితీవ్రత పెరిగింది. అక్టోబరు నెల జిల్లా సగటు వర్షపాతం 12.7మిమీ కాగా, శుక్రవారం ఒక్కరోజే రికార్డు స్థాయిలో 51.0 మిమీ వర్షం కురవగా, ఈనెల 1వ తేది నుంచి 10వ తేది వరకు 138.7 మిమీ వర్షపాతం నమోదయ్యింది. శనివారం కూడా పిడుగులతో కూడిన భారీవర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ తెలిపింది.ఎస్ఆర్‌పురం మండలం కమ్మకండ్రిగ పంచాయతీ పరిధిలో గురువారం రాత్రి కురిసిన వానతో మూడు గ్రామాలకు రాకపోకలునిలిచిపోయాయి.పలమనేరు మండలం ముసలిమడుగు వద్ద పంట పొలాల్లో వర్షపునీరు నిలిచిపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేశారు.



పలమనేరు మండలం ముసలిమడుగు వద్ద పూలతోటలో వర్షపునీరు



వీధుల్లో నీటిప్రవాహంతో నీవానది కాలనీవాసుల ఇబ్బందులు



తేనెబండ సర్కిల్లో కల్వర్టును శుభ్రం చేస్తున్న పొక్లయినర్

నీవా పరివాహకానికి రక్షణేదీ?

- ఎగువన వర్షమొచ్చిన ప్రతిసారీ ఇబ్బందులు
- ఆక్రమణలు తొలగించి నదికి రక్షణ గోడ కడితేనే పరిష్కారం

చిత్తూరు అర్బన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాలతో పాటు చిత్తూరు సమీప మండలాల్లో భారీ వర్షం కురిసిన ప్రతిసారీ నగరంలోని నీవా పరివాహక ప్రాంతాలు నీట మునుగుతున్నాయి. పరివాహక ప్రాంతవాసుల్ని శాశ్వతంగా వేరే చోటుకు తరలిస్తామని వర్షమొచ్చినప్పుడల్లా చెప్పే అధికారులు, ప్రజాప్రతినిధులు వర్షం ఆగాక ఆ మాటను మరిచిపోతున్నారు.భారీ వర్షాలు పడినప్పుడు స్థానికులను ఇతర ప్రాంతాలకు తరలించి ఆశ్రయంతో పాటు ఆహారాన్ని అందించడం పరిపాటిగా మారిపోయింది.ఆక్రమణలను తొలగించి, రక్షణ గోడ నిర్మిస్తేనే ఈ సమస్యకు పరిష్కారం లభించనుంది.

రెండు రోజులుగా ఎగువ ప్రాంతాలతో పాటు పూతలపట్టు, చిత్తూరు నియోజకవర్గాల్లో కురిసిన భారీ వర్షాల కారణంగా నీవానది పొంగి పొర్లుతోంది. చిత్తూరు నగరంలోని పోతంబట్టు వద్ద నీవానది ప్రారంభమై ఎన్టీయార్ జలాశయం వరకు కొనసాగుతోంది. నదీ పరివాహక ప్రాంతాలను ఆక్రమించి ఇళ్ల నిర్మాణాలు చేపట్టడంతో పాటు నదికి వచ్చే తూములు మూసుకుపోయాయి.

వర్షాల సీజన్‌కు ముందు ఇరిగేషన్‌శాఖ, నగరపాలక అధికారులు నదిలోని ముళ్లకంపలు, ఇతర వ్యర్థాలను తొలగించాల్సి ఉంది. కానీ అది చేయడంలేదు. దీంతో భారీ వర్షాలు పడిన ప్రతిసారీ నీవానదిని ఆనుకుని వున్న వీరభద్రకాలనీ, రిక్షా కాలనీ, తేనబండ, తోటపాళ్యం, దోబీఘాట్, కైలాసపురం ప్రాంతాలు జలమయమవుతున్నాయి. శుక్రవారం కూడా అక్కడి ఇళ్లలోకి వర్షపు నీరు చేరిపోయింది.చాలా ఇండ్లలోని సామాన్లు, సరుకులు తడిసిపోయాయి.ద్విచక్రవాహనాలు పాడైపోయాయి.



● ఆక్రమణలను తొలగిస్తేనే..

నీవానది పరివాహక ప్రాంతాలన్నీ దాదాపు నదిని ఆక్రమించుకుని కట్టినవే. పెద్దఎత్తున వరదొస్తే ప్రమాదం ముంచుకొస్తుందనే ఆలోచనలతో నాటి అధికారులు వారికి ప్రశాంత్‌నగర్, ఇందిరమ్మకాలనీ, వైఎస్ కాలనీల్లో పట్టాలిచ్చి ఇళ్లు కట్టిస్తామని చెప్పారు. అయితే ఇక్కడి వారంతా రోజువారీ కూలీలు కావడంతో అంతదూరం నుంచి పనులకు రాలేమని అక్కడికి వెళ్లడానికి ఆసక్తి చూపడం లేదు.నీవానదిలో ఆక్రమణలను తొలగించి రిటైనింగ్ వాల్ (రక్షణ గోడ) కడితే తప్ప ముంపును అరికట్టలేమని అధికారులు చెబుతున్నారు.

ముంపు ప్రాంతాల పరిశీలన

వర్షం కారణంగా ముంపునకు గురైన ప్రాంతాలను శుక్రవారం కమిషనర్ నరసింహ ప్రసాద్ పరిశీలించారు. వర్షాలు కొనసాగే అవకాశం ఉన్నందున అవసరమైతే జనాలను సురక్షిత ప్రాంతాలకు తరలించడానికి అత్యవసర బృందాలను సిద్ధం చేసినట్లు చెప్పారు. ఎమ్మెల్యే జగన్మోహన్ సూచన మేరకు వరద ముంపు ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం అల్పాహారంతో పాటు మధ్యాహ్నం భోజనాల్ని అందించారు. మేయర్ అముద, టీడీపీ నగర అధ్యక్షుడు నరేష్, లీలావతి, ఆర్ఎస్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేడు దేవళంపేటకు హోం మంత్రి అనిత

వెదురుకుప్పం, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి):హోం మంత్రి అనిత శనివారం ఉదయం 10 గంటలకు వెదురుకుప్పం మండలం దేవళంపేట రానున్నారు. బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని కాల్చిన ఘటనతో ఇటీవల దేవళంపేట వార్తల్లో నిలిచిన విషయం తెలిసిందే.ఈ ఘటన స్థలాన్ని పరిశీలించడానికి హోం మంత్రి పలువురు ఎమ్మెల్యేలతో కలిసి వస్తున్నారని ఎమ్మెల్యే వీఎం థామస్ తెలిపారు. టీడీపీ ఎమ్మెల్యేలు ఎంఎస్‌రాజు,విజయశ్రీ, మురళీమోహన్, పాశం సునీల్‌కుమార్, ఆదిమూలంతో పాటు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు దేవళంపేటకు వస్తున్నారని ఆయన తెలిపారు.ఇక్కడ ఏర్పాటు చేసే సభలో ప్రజలనుద్దేశించి మాట్లాడతారన్నారు.

కల్లూరు ఘాట్‌లో ఒంటరి ఏనుగు హల్‌చల్



కల్లూరు ఘాట్ రోడ్డును దాటుతున్న ఒంటరి ఏనుగు (వృత్తంలో)

కల్లూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం కల్లూరు ఘాట్ రోడ్డులో శుక్రవారం సాయంత్రం ఒంటరి ఏనుగు హల్‌చల్ చేసింది. తూర్పు విభాగం అటవీ ప్రాంతంలో ఉన్న 9 ఏనుగుల గుంపు పంటలను ధ్వంసం చేస్తూ రెండు రోజుల క్రితం చిన్నగొట్టిగల్లు మండలంలోకి వెళ్లిపోయాయి. పశ్చిమ విభాగం అటవీ ప్రాంతంలో ఉన్న 7 ఏనుగుల గుంపులో 4 ఏనుగులు సోమల మండలం వైపు వెళ్లిపోగా రెండు ఏనుగులు సదుం మండలం వైపు వెళ్లిపోయాయి. శుక్రవారం సాయంత్రం పశ్చిమ విభాగం అటవీ ప్రాంతం నుంచి కల్లూరు ఘాట్‌రోడ్డు వద్దకు చేరుకున్న ఒంటరి ఏనుగు చిత్తూరు-కర్నూలు జాతీయ రహదారిపైకి చేరుకుంది.రహదారిపై వెళ్లే వాహనదారులు గమనించి భయాందోళనకు గురయ్యారు.చివరకు ఆ ఏనుగు తూర్పు విభాగం అటవీ ప్రాంతంలోకి వెళ్లిపోయింది. అయితే అర్ధగంట అనంతరం తిరిగి హైవేపైకి చేరుకుంది.మళ్లీ వచ్చిన మార్గంలోనే పశ్చిమ విభాగం అటవీ ప్రాంతంలోకి వెళ్లిపోయింది. విషయం తెలుసుకున్న అటవీశాఖ సిబ్బంది హైవేపైకి చేరుకొని రహదారిపై వెళ్లే ప్రజలను అప్రమత్తం చేశారు.

బంగారుపాళ్యం రైతుకు జాతీయస్థాయి గుర్తింపు



జగదీశ్వర రెడ్డి

చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): బంగారుపాళ్యం మండలం దండువారిపల్లెకు చెందిన ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతు వై.జగదీశ్వర్‌రెడ్డికి జాతీయ స్థాయి గుర్తింపు లభించింది. ప్రధాన మంత్రి ధన-ధాన్య యోజన (పీఎండీడీవై) కింద దేశ స్థాయిలో ప్రకృతి వ్యవసాయ రైతుల విభాగంలో మన జిల్లా రైతుకు స్థానం లభించింది. ఉత్తర భారతదేశంలో నలుగురు రైతులుండగా, దక్షిణ భారతదేశంలో మన చిత్తూరు జిల్లా రైతుకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. దీంతో మంగళవారం న్యూఢిల్లీలో కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమం వారి ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమంలో జగదీశ్వర్‌రెడ్డి పాల్గొననున్నారు.

పాఠశాలల్లో మొదలైన యాప్‌డౌన్

చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో బోధనేతర పనులు నిలుపుదల చేయాలంటూ ఫ్యాప్టో ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి టీచర్లు చేపట్టిన యాప్‌డౌన్ కార్యక్రమం మొదలైంది. తొలి రోజున ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరుతోపాటు మధ్యాహ్న భోజనం పథకానికి సంబంధించి మాత్రమే యాప్‌లో నమోదు చేశారు. గూగుల్ షీట్స్ నింపడం, విద్యాశక్తి, జీఎస్టీ 2.0, సీజనల్ యోగాంధ్ర, మెగా డీఎస్సీ పీటీఎంలో ఫొటోలు, వీడియోలు అప్‌లోడ్ చేయడం వంటి బోధనేతర పనులు యాప్‌లో అప్‌లోడ్ చేయడం నిలిపివేశారు. తొలిరోజున 70 శాతం కార్యక్రమం విజయవంతం చేసినట్లు ఉపాధ్యాయ సంఘాల నాయకులు తెలిపారు.

ఈ జాప్యం... కాదు క్షమార్హం

- లింగ నిర్ధారణ కేసులో ఐదునెలల తరువాత అటెండర్ సస్పెన్షన్
- వైద్యఆరోగ్య శాఖపై విమర్శలు



డీఎంహెచ్‌వో కార్యాలయం

చిత్తూరు రూరల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి):లింగ నిర్ధారణ పరీక్షల కేసుకు సంబంధించి కలెక్టరే స్వయంగా నిందితులను పట్టించినా జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారులకు వారిపై చర్యలు తీసుకోవడానికి సమయం కుదరలేదు. ఐదు నెలల కిందట లింగ నిర్ధారణ ముఠాను పట్టుకున్నా, వారిలోని వైద్య సిబ్బందిపై చర్యలు ఇంతవరకు తీసుకోలేదు. మొత్తం ముగ్గురున్నారని తేల్చి...ఐదు నెలల జాప్యం తరువాత శుక్రవారం ఒకరిపై మాత్రమే చర్యలు తీసుకోవడంతో తీవ్ర విమర్శలు వస్తున్నాయి.వైద్యారోగ్య శాఖ నిబంధనలకు విరుద్ధంగా చిత్తూరు నగరంలో లింగ నిర్ధారణ పరీక్షలు జరుగుతున్నాయని తెలుసుకున్న కలెక్టర్ సుమిత్ కుమార్ నిఘా పెట్టారు. రెండు నెలల తరువాత భగత్‌సింగ్ కాలనీలో తమిళనాడు రాష్ట్రానికి చెందిన పలువురు మహిళలకు పరీక్షలు జరుగుతున్నట్లు గుర్తించారు.స్థానిక అధికారుల మీద నమ్మకం లేక ఆయనే మే 14న అక్కడికి వెళ్లారు. లింగ నిర్ధారణ పరీక్షలకు సంబంధించిన యంత్రాలను సీజ్ చేసి, 11మంది గర్భిణుల్ని, ముగ్గురు నిర్వాహకుల్ని అదుపులోకి తీసుకున్నారు. 2014 నుంచి అంటే 11 ఏళ్లుగా ఇక్కడ పరీక్షలు చేస్తూ నెలకు దాదాపు రూ.10 లక్షలకు పైగా సంపాదిస్తున్నారని విచారణలో తేలింది. ఈ 11 ఏళ్లలో ఒక్క కేసూ నమోదు కాకపోవడం,వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడం ఆశ్చర్యకరం. ఈ క్రమంలోనే అప్పట్లో డీఎంహెచ్‌వోకు, డీసీహెచ్ఎస్‌కు కలెక్టర్ నోటీసులు కూడా ఇచ్చారు. అప్పటి నుంచి ఈ కేసు అనేక మలుపులు తిరిగింది. నిందితుల్ని కేసులో నుంచి తప్పించేందుకు పోలీసులు పెద్దఎత్తున డబ్బులు వసూలు చేశారనే ఆరోపణలు కూడా వచ్చాయి. మొత్తానికి 20మందిపై కేసులు నమోదు చేశారు.వారిలో వైద్యారోగ్య శాఖ సిబ్బంది ముగ్గురున్నట్లు తేలింది. గుడిపాల పీహెచ్‌సీ అటెండర్, జీడీ నెల్లూరుకు చెందిన ఓ ఏఎన్ఎం, పాలసముద్రానికి చెందిన ఆశా వర్కర్ ఈ ముఠా కార్యక్రమాల్లో పాలుపంచుకుంటున్నారని ఉన్నతాధికారులకు కూడా తెలిసింది. కానీ చర్యలు తీసుకోవడంలో జాప్యం చేశారు. దీని వెనుక కూడా పెద్ద మొత్తం చేతులు మారిందని ఆ శాఖలో గుసగుసలు వినిపించాయి.ఈలోపు తమిళనాడు పోలీసులు కేసు నమోదు చేసి గుడిపాల అటెండరును అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచారు.రిమాండ్‌పై జైల్లో వున్న అటెండర్ ఇటీవలే బయటకు వచ్చాడు.ప్రభుత్వ ఉద్యోగిపై ఎఫ్ఐఆర్ నమోదు అయితేనే వెంటనే అతన్ని సస్పెండ్ చేస్తుంటా రు.అటువంటిది ఈ ఘటనలో ముఠాతో సంబంధం ఉందని నిర్ధారించినా చర్యలు తీసుకునేందుకు 5నెలలు పట్టింది. స్వయంగా కలెక్టర్ కల్పించుకున్న కేసులోని నిందితులపై చర్యలు తీసుకోవడంలో అలసత్వం వహించడంపై ఉన్నతాధికారులు ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం.దీంతో ఎట్టకేలకు శుక్రవారం అటెండర్‌ను మాత్రమే సస్పెండ్ చేశారు.మిగిలిన ఇద్దరు ఉద్యోగులపై ఇంకెప్పుడు చర్యలు తీసుకుంటారో చూడాలి. ఇదిలా ఉండగా, ఈ కేసు ప్రస్తుతం జిల్లా కోర్టులో నడుస్తోంది. దీన్ని పర్సనల్‌గా తీసుకున్న కలెక్టర్ సుమిత్‌కుమార్ ఇద్దరు ప్రైవేటు లాయర్లను పెట్టుకుని మరీ ఫాలోఅప్ చేస్తున్నారు. ఆ ఇద్దరితో ఎఫ్ఐఆర్‌లో, కోర్టులో వాదనల్లో లోపాలు లేకుండా చూసుకుంటున్నారు.

రెండు ఏనుగులకు రేడియో కాలరింగ్ బెల్ట్

అటవీశాఖ అధికారుల యత్నం



దామలచెరువు బీట్‌లో గజసంచార ప్రాంతాలను పరిశీలిస్తున్న రాకేష్, అటవీ శాఖ అధికారులు

చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): అటవీ ప్రాంతాల సమీపంలోని గ్రామీణ ప్రాంతాల్లో ఏనుగుల సంచారం అరికట్టేందుకు అటవీశాఖ అధికారులు చర్యలు చేపట్టారు. కౌండిన్య అభయారణ్యంలో సంచరిస్తున్న రెండు ఏనుగులకు రేడియో కాలరింగ్ బెల్ట్ ఏర్పాటు చేసే ప్రయత్నంలో పడ్డారు. నాలుగేళ్ల క్రితం ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ సహకారంతో ఎంపిక చేసిన ఏనుగులకు దీన్ని ఏర్పాటు చేయాలని భావించినా, సాంకేతిక సమస్యల కారణంగా వీలు కాలేదు.ఈ నేపథ్యంలో వైల్డ్ లైఫ్ ఎక్స్‌పర్ట్ రాకేష్ శుక్రవారం చిత్తూరు ఈస్టు, వెస్టు, వనపాకం ప్రాంతాల్లోని ఎఫ్ఆర్వోలు, డీఆర్వోలు, ఎఫ్ఎస్ఓలు, ఓఫ్‌బీవోలు, 14 మంది ఎలిఫెంట్ ట్రాకర్లతో కలిసి దామలచెరువు బీట్‌లో ఏనుగుల సంచార ప్రాంతాలను పరిశీలించారు. గురువారం పలమనేరు ప్రాంతంలోనూ పరిశీలించారు. పలమనేరు ప్రాంతంలో తిరుగుతున్న ఒంటరి ఏనుగుతో పాటు పులిచెర్ల, దామలచెరువు, కల్లూరు ప్రాంతాల్లో తరచూ సంచరిస్తున్న ఏనుగుల గుంపులో ఒక ఏనుగుకు రేడియో కాలరింగ్ బెల్ట్ అమర్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ బెల్ట్ ద్వారా జీయో ట్రాకింగ్ సిస్టమ్‌ను ఆయా అటవీ పరిసర ప్రాంతాల ఎఫ్ఆర్వోలు, డీఆర్వోలు, ఎఫ్ఎస్ఓల మొబైల్స్‌కు అనుసంధానం చేయనున్నారు. దీని ద్వారా ఏనుగులు ఏ సమయంలో ఏ ప్రాంతంలో సంచరిస్తున్నాయి, ఎక్కడ ప్రమాదం పొంచి ఉందనే విషయాలను పసిగట్టే వీలుంది.దీంతో ఆయా ప్రాంతాల్లోని అటవీ సిబ్బందిని, ఎలిఫెంట్ ట్రాకర్లను అప్రమత్తం చేస్తారు. వారు వెంటనే ప్రాంతానికి చేరుకుని, ఏనుగులను అటవీ ప్రాంతంలోకి మళ్లించే ప్రయత్నం చేస్తారు.

నేడు మామిడి రైతులకు సబ్సిడీ జమ

- రూ.183 కోట్లను జమ చేయనున్న ప్రభుత్వం

చిత్తూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి):మామిడి రైతులకు అందాల్సిన సుమారు రూ.183 కోట్ల సబ్సిడీని ప్రభుత్వం శనివారం విడుదల చేయనుంది.గిట్టుబాటు ధర లేక ఇబ్బంది పడుతున్న తోతాపురి రకం మామిడి రైతులకు సీఎం చంద్రబాబు కిలోకు రూ.4 మద్దతు ధరను ప్రకటించిన విషయం తెలిసిందే. చిత్తూరు జిల్లాలో 3.73 లక్షలు, తిరుపతిలో 66 వేల టన్నుల కాయల్ని పరిశ్రమలు కొనుగోలు చేశాయి. ప్రభుత్వం మద్దతు ధరను రూ.12గా నిర్ణయించి, ఫ్యాక్టరీలు రూ.8 ఇవ్వాలని, మిగతా రూ.4 ప్రభుత్వం సబ్సిడీ రూపంలో ఇస్తుందని చెప్పినా ఫ్యాక్టరీలు పాటించలేదు. చివరి వారం మినహా సీజన్ మొత్తం రూ.6 మాత్రమే ఇచ్చాయి. ఆయా ఫ్యాక్టరీలు, ర్యాంపుల వద్ద ప్రభుత్వ ఉద్యోగుల బృందాలు విడతల వారీగా పనిచేసి మరీ రైతుల వివరాలను తీసుకున్నాయి. జూలై నెలలో సీజన్ ముగియగా, అప్పటి నుంచి రైతులు సబ్సిడీ కోసం ఎదురుచూస్తున్నారు. సుమారు నెల రోజుల పాటు వ్యవసాయ, ఉద్యానవన, మార్కెటింగ్ శాఖల అధికారులు సచివాలయ సిబ్బంది సహకారంతో ఆయా రైతుల వివరాలను మరోసారి క్రాస్‌చెక్ చేయించారు. ఫైనల్ జాబితాలను తయారుచేసి అప్లోడ్ చేసిన నెల తర్వాత నిధులు విడుదల చేస్తున్నారు.చిత్తూరు జిల్లాలో సుమారు 40 వేల మంది రైతులకు రూ.148 కోట్లు, మిగిలిన అన్నమయ్య, తిరుపతి జిల్లాలకు రూ.35 కోట్లు చొప్పున సబ్సిడీ జమ కానుంది.

గుడుపల్లెలో రీఫైండ్ నూనెల ప్రాసెసింగ్ యూనిట్

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): కుప్పం నియోజకవర్గంలోని గుడుపల్లె మండలంలో రీఫైండ్ నూనెలు, సోయా ఉత్పత్తుల ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు కోసం రూ.201 కోట్ల పెట్టుబడితో 436 మందికి ఉద్యోగాలు కల్పించనున్న ఎస్వీఎఫ్ సోయాకంపెనీ యూనిట్‌కు రాష్ట్ర మంత్రివర్గ ఆమోదం లభించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన శుక్రవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో గ్రామ పంచాయతీల పునఃనిర్మాణం, పునఃవర్గీకరణ ప్రతిపాదనకు ఆమోదం లభించింది. ప్రస్తుతమున్న పంచాయతీ క్లస్టర్లను రద్దుచేసి స్వతంత్ర యూనిట్లుగా పరిగణించనున్నారు. జనాభా, ఆదాయంఆధారంగా పంచాయతీలను స్పెషల్ గ్రేడ్, గ్రేడ్-1, గ్రేడ్-2, గ్రేడ్-3 అనే వర్గాలుగా పునర్వ్యవస్థీకరించనున్నారు. గ్రేడ్-1 పంచాయతీ సెక్రటరీ పోస్టులను స్పెషల్ గ్రేడ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లుగా, డిప్యూటీ మండల పరిషత్ అభివృద్ధి అధికారి కేడర్‌లో అప్‌గ్రేడ్ చేయడం జరుగుతుంది.ఐదుగా వున్న గ్రేడ్లను మూడు గ్రేడ్లుగా కలపడం ద్వారా పంచాయతీ సెక్రటరీ పోస్టుల హేతుబద్ధీకరణ జరగనుంది. పంచాయతీ సెక్రటరీ ఉద్యోగాన్ని పంచాయతీ డెవలప్‌మెంట్ ఆఫీసర్‌గా పిలవనున్నారు. స్పెషల్ గ్రేడ్ గ్రామ పంచాయతీల్లో ఉన్న జూనియర్ అసిస్టెంట్ పోస్టులను సీనియర్ అసిస్టెంట్ పోస్టుగా అప్‌గ్రేడ్ చేస్తారు.



నన్ను ఇప్పుడు 'ఓజీ' డ్రమ్మర్ అంటున్నారు

● శివమణి

తిరుమల, అక్టోబరు10(ఆంధ్రజ్యోతి): 'చెన్నైలో ఉన్నప్పుడు నన్ను అందరు ఏఆర్ రెహ్మాన్ డ్రమ్మర్ అంటారు. ఇప్పుడు కొత్త ట్రెండ్ మొదలైంది. నన్ను చూడగానే 'ఓ.జీ' డ్రమ్మర్ వచ్చేశారు అంటున్నారు' అని డ్రమ్స్ శివమణి సంతోషంగా చెప్పారు. తిరుమల శ్రీవారిని శుక్రవారం ఉదయం ఆయన దర్శించుకున్న ఆయన మీడియాతో మాటాడుతూ, బాలయ్య 'అఖండ-2' చిత్రం కోసం నేరుగా ముంబై వెళ్తున్నానని చెప్పారు. ఇలా ఉండగా, స్వామి దర్శించుకునే సమయంలో కూడా శివమణి చేతిలో డ్రమ్స్ స్టిక్స్ ఉన్నాయి. దీనిని చాలా మంది ఆసక్తిగా చూశారు.

→ ఆలయం ముందు డ్రమ్స్ స్టిక్స్‌తో శివమణి



స్వాతి (ఫైల్‌ఫొటో)

రోడ్డు ప్రమాదంలో స్టాఫ్ నర్సు మృతి

శ్రీకాళహస్తి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ ప్రైవేటు స్టాఫ్ నర్సు మృతి చెందింది. ఈ ఘటన శుక్రవారం రాత్రి శ్రీకాళహస్తి మండలం అరవకొత్తూరు సమీపంలో ముచ్చివోలు రహదారిపై చోటు చేసుకుంది. శ్రీకాళహస్తి రూరల్ ఇన్‌ఛార్జి సీఐ గోపి కథనం మేరకు.. శ్రీకాళహస్తి మండలం ఉడమలపాడు గ్రామానికి చెందిన గురవయ్య ప్రైవేటు పరిశ్రమలో పనిచేస్తుంటాడు. ఆయన భార్య స్వాతి(26). ఈమె శ్రీకాళహస్తిలోని ఆర్టీసీ బస్టాండు వద్ద ఉన్న ఓ ప్రైవేటు ఆస్పత్రిలో స్టాఫ్ నర్సుగా పనిచేస్తుండేది. శుక్ర వారం రాత్రి విధులు ముగిసిన అనంతరం గురవయ్య భార్య స్వాతితో కలిసి ద్విచక్రవాహనంపై ఇంటికి బయలుదేరాడు. పట్టణ శివారు అరవకొత్తూరు సమీపంలో ముచ్చివోలు రహదారిపై వెళుతండగా టిప్పర్ లారీ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో స్వాతి తీవ్రంగా గాయపడింది. స్థానికుల సాయంతో భర్త ఆమెను శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించాడు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు ధ్రువీక రించారు. భర్త, కుటుంబసభ్యులు బోరున విలపించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు.


సర్వదర్శనానికి 14 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని 9 షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయాయి. క్యూలైన్ శిలాతోరణం సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

బుధవారం హుండీ ఆదాయం: రూ.4.15 కోట్లు

గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 66,883

తలనీలాలు సమర్పించినవారు: 26,000



తిరుపతి జిల్లా హౌసింగ్ హెడ్ దయాకర్ సస్పెన్షన్

● మరో 12 మంది కిందిస్థాయి అధికారులపై చర్యలకు సిఫార్సు

అమరావతి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా హౌసింగ్ హెడ్ (ఇన్‌ఛార్జి) పి.దయాకర్‌ను ప్రభుత్వం సస్పెండ్ చేసింది. ఆయన గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నెల్లూరు జిల్లాలో డిప్యూటీ ఈఈగా, ఈఈగా పనిచేసినప్పుడు కొండ్లపూడి, వెంకటేశ్వరపురం లే-అవుట్లలో అక్రమాలకు పాల్పడ్డారని, పేదల ఇళ్ల నిర్మాణానికి సంబంధించి స్టేట్ డీవియేషన్ల ద్వారా అదనపు చెల్లింపులకు సిఫార్సులు చేసి నిధుల దుర్వినియోగానికి పాల్పడి, హౌసింగ్ కార్పొరేషన్ ఖజానాకు రూ. కోట్లలో నష్టం కల్గించారని, ఇళ్ల నిర్మాణ పర్యవేక్షణలో కూడా విఫలమైనట్లు విజిలెన్స్ విచారణలో తేలింది. దీంతో దయాకర్‌పై సస్పెండ్ చేస్తూ రాష్ట్ర గృహనిర్మాణశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. దయాకర్‌తోపాటు లే అవుట్లలో అవినీతి కార్యకలాపాల్లో భాగస్వాములైన అసిస్టెంట్ ఇంజినీరు పసుపులేటి సురేష్‌కుమార్ ((రిటైర్డ్), గొల్లపూడి రామకృష్ణ (రాపూరు), ఎ.నాగరాజు (అప్పటి డివిజన్ హెడ్-రిటైర్డ్), ఎం.వెంకటమోహనరావు (ప్రస్తుత నెల్లూరు డివిజన్ హెడ్), పల్లా వెంకటదాసు (అప్పటి నెల్లూరు డివిజన్ హెడ్ - కర్నూలు జిల్లాలో పదవీ విరమణ చేశారు), పరవస్తు నరసింహం (అప్పటి నెల్లూరు డివిజన్ హెడ్-రిటైర్డ్), తోట వెంకటశేషయ్య (అప్పటి నెల్లూరు డివిజన్ హెడ్), మొహమ్మద్ జహీరుద్దీన్ అహ్మద్ (ప్రస్తుతం సర్వేపల్లి రూరల్ సబ్ డివిజన్ డీఈఈ), పటాన్ అహ్మద్‌బాషా, (రిటైర్డ్ ఏఈ), తాళ్లూరు భాస్కరరావు (ప్రస్తుతం మనుబోలు మండల ఏఈ), ఎం.మధుసూధనరావు (అప్పటి ఏఈ-ప్రస్తుతం సస్పెన్షన్‌లో ఉన్నారు), ఎం.కృష్ణారెడ్డి (రిటైర్డ్ ఏఈ)లపై శాఖాపరమైన విచారణ నిర్వహించి, క్రమశిక్షణ చర్యలు తీసుకోవడంతోపాటు వారి నుంచి అదనపు చెల్లింపుల మొత్తాన్ని తిరిగి రాబట్టడానికి చర్యలు తీసుకోవాలంటూ హౌసింగ్ కార్పొరేషన్ ఎండీని ఆదేశిస్తూ లేఖ రాశారు.

లైసెన్స్ లేని బాణసంచా కంటైనర్, లారీ సీజ్



తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): తమిళనాడు శివకాశి నుంచి లైసెన్స్ లేకుండా బాణసంచాతో వచ్చిన కంటైనర్, లారీని తిరుపతి, రేణిగుంట పోలీసులు శుక్రవారం సీజ్ చేశారు. ఎస్పీ సుబ్బరాయుడికి అందిన రహస్య సమాచారం మేరకు.. అలిపిరి ఎస్ఐ నాగార్జున రెడ్డి సిబ్బందితో కలిసి కొరమేనుగుంటలోని మిట్టూరు ట్రాన్స్‌పోర్టు కార్యాలయం వద్ద తనిఖీలు చేపట్టారు. శివకాశి నుంచి కంటైనర్‌లో తెప్పించిన రూ రూ.2.5 లక్షల విలువ చేసే 38 బాక్సుల బాణసంచా కనిపించింది. అదే సమయంలో రేణిగుంటలో పట్టుబడిన లారీలో తనిఖీ చేయగా రూ.2.8 లక్షల బాణసంచా దొరికింది. లైసెన్స్ లేకపోవడంతో రెండింటినీ సీజ్ చేశారు. మిట్టూరు ట్రాన్స్‌పోర్టు నిర్వాహకులు, మరో ఇద్దరిపై కేసు నమోదు చేశారు. వారిని అరెస్టు చేసి, వాహనాలను సీజ్ చేసినట్లు పోలీసులు చెప్పారు. లైసెన్సు లేకుండా బాణసంచా తెచ్చినా, విక్రయించినా, నిల్వ చేసినా చట్టపరంగా చర్యలు తప్పవన్నారు. అలాంటి సమాచారం అందితే 112కు తెలియజేయాలని కోరారు.

తిరుచానూరు నుంచి మరిన్ని రైళ్లు



సీసీఐ శ్రీకాంత్

తిరుపతి(సెంట్రల్), అక్టోబరు10 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల సౌకర్యార్థం తిరుచానూరు రైల్వేస్టేషన్ నుంచి మరిన్ని రైళ్లను నడపనున్నట్లు తిరుపతి చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్ తెలిపారు. శుక్రవారం తిరుచానూరు రైల్వేస్టేషన్‌ను సందర్శించిన ఆయన సికింద్రాబాదు నుంచి వచ్చిన ప్రత్యేక రైలు ప్రయాణికులను వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ పెరుగుతున్న భక్తుల రద్దీకి అనుగుణంగా ప్రత్యేక రైళ్లను పెంచినట్లు చెప్పారు. తిరుపతి రైల్వేస్టేషన్‌లో నిర్వహణ, పార్కింగ్ సమస్యల కారణంగా తిరుచానూరు స్టేషన్ నుంచి ప్రత్యేక రైళ్లతోపాటు ప్యాసింజర్లను నడపాలని ఉన్నతాధికారులు నిర్ణయించారని తెలిపారు. ఇప్పటికే ఐదు ప్రత్యేక రైళ్లను ఈ స్టేషన్ నుంచి నడుపుతున్నామని, మరిన్ని నడిపేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. చెన్నై, అరక్కోణం వరకు మెము రైళ్లను రోజూ నడుపుతున్నామని తెలిపారు. స్టేషన్‌లో ప్రయాణికులకు మౌలిక వసతులు కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో రేణిగుంట సీసీఐ చలపతి, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మురళీకృష్ణ, శ్రీనివాస్, రాజేంద్ర పాల్గొన్నారు.

కల్యాణ వెంకన్న ఆలయంలో విరిగిన వేప చెట్టు కొమ్మ

● భక్తులకు తప్పిన ప్రమాదం



కల్యాణ వెంకన్న ఆలయంలో విరిగిన చెట్టు కొమ్మ

చంద్రగిరి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణలోని భారీ వేప చెట్టు కొమ్మ అకస్మాత్తుగా విరిగిపడింది. అయితే భక్తులకు ప్రమాదం తప్పింది. గత రెండు రోజులుగా మండల వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురవడంతో వేపచెట్టు బాగా తడిసింది. ఈక్రమంలో శుక్రవారం ఉదయం ధ్వజస్తంభం నుంచి బలిపీఠం వరకు విస్తరించి ఉన్న భారీ వేపకొమ్మ విరిగి పడింది. దీంతో ఆలయ ఆవరణలోని విద్యుత్ తీగలు, ఇనుప పైపులు, పందిరిపై పడటంతో పాక్షికంగా దెబ్బతిన్నాయి. ఘటన జరిగిన సమయంలో భక్తుల రద్దీ లేకపోవడంతో ఎలాంటి ప్రమాదం చోటుచేసుకోలేదని అధికారులు తెలిపారు. తక్షణమే అధికారులు, సిబ్బంది విరిగిన కొమ్మలను తొలగించారు.

దూరవిద్య ఉద్యోగి మృతి



మునిశేఖర్ (ఫైల్ ఫొటో)

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ దూరవిద్యా విభాగ ఉద్యోగి మునిశేఖర్ (40) మృతి చెందారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్న ఆయన తిరుపతిలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు. తిరుపతి రూరల్ పెరుమాళ్లపల్లె పంచాయతీ ఎస్వీ నగర్‌కు చెందిన మునిశేఖర్ 20 ఏళ్లుగా ఎస్వీయూలో ఎన్ఎంఆర్‌గా పనిచేస్తున్నారు. ఆయనకు భార్య, ఒక కుమారుడు ఉన్నారు. మునిశేఖర్ మృతికి దూర విద్య ఉద్యోగులు సంతాపం వ్యక్తం చేశారు.

'సీఎంఆర్' అగ్నికీలలు

● షార్ట్‌సర్క్యూట్‌తో ఆయిల్ పైపు అంటుకోవడంతో ప్రమాదం

● మూడు గంటల పాటు అదుపులోకిరాని మంటలు ● అస్వస్థతకు గురైన పలువురు కార్మికులు





సీఎంఆర్ కంపెనీలో ఎగసిపడుతున్న మంటలు, అలుముకున్న పొగ - కంపెనీలో ప్రతినిధులతో మాట్లాడుతున్న అధికారుల బృందం

ఏర్పేడు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు మండలంచింతపాళెం రెవెన్యూ పరిధిలోని సీఎంఆర్ అల్యూమినియం ఈకో కంపెనీలో శుక్రవారం సాయంత్రం ఐదు గంటల సమయంలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఆయిల్‌పైపు లీకు కావడం.. షార్ట్‌సర్క్యూట్ జరగడంతో ఆ ఆయిల్ అంటుకొని మంటలు చెలరేగినట్లు పరిశ్రమ వర్గాలు, అధికారులు చెబుతున్నారు. ఈ మంటలను గుర్తించి కార్మికులు బయటకు పరుగుతీశారు. అప్పటికే దట్టంగా పొగ అలుముకోవడంతో ఊపిరి పీల్చుకోవడానికి ఇబ్బందిపడి కొందరు అస్వస్థతకు గురయ్యారు. వీరిని తిరుపతి, శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రులకు తరలించారు. మరోవైపు పరిశ్రమంలోని ఇంజన్ల ద్వారా మంటలను అదుపుచేసేందుకు యత్నించినా సాధ్యపడలేదు. దీంతో 112కు ఫోన్ చేసి కంపెనీ



శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కార్మికులు

అధికారులు తిరుపతి, వెంకటగిరి, శ్రీకాళహస్తి ప్రాంతాల నుంచి ఫైర్‌ఇంజన్లను రప్పించారు. సుమారు మూడు గంటల పాటు కష్టపడి మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంతో చింతపాళెం, రాజులపాళెం గ్రామాల్లోనూ పొగ అలుముకుంది. వెంకటగిరికి వెళ్లే వాహనదారులూ ఇబ్బంది పడ్డారు. మరోవైపు శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి, ఏర్పేడు తహసీల్దారు భార్గవి, రేణిగుంట డీఎస్పీ శ్రీనివాసరావు, ఏర్పేడు సీఐ శ్రీకాంత్‌రెడ్డి పరిశ్రమ వద్దకు చేరుకున్నారు. ప్రమాదానికి గల కారణాలను ఆరా తీశారు. సహాయక చర్యలు చేపట్టారు.

అప్రమత్తతతో తప్పిన ప్రాణనష్టం

ఈ ప్రమాదం జరిగిన సమయంలో పరిశ్రమ లోపల 300 మంది కార్మికులు ఉన్నారు. వీరంతా ఉదయం 9 గంటలకు విధులకు వెళ్లారు. సాయంత్రం ఐదున్నర గంటలకు బయటకు రావాలి. 5 గంటల సమయంలో ప్రమాదం జరిగింది. అందరూ అప్రమత్తమై బయటకు పరుగు తీయడంతో ప్రాణనష్టం తప్పింది.

అట్టహాసంగా 'మోహన మంత్ర'

● ఎంబీయూలో ఆకట్టుకున్న ఈవెంట్లు





చంద్రగిరి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం, ఎ.రంగంపేట సమీపంలోని మోహన్‌బాబు విశ్వవిద్యాలయంలో ప్రతిష్ఠాత్మకంగా ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్న మోహన మంత్ర మహోత్సవం శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమైంది. శుక్రవారం నుంచి ఆదివారం వరకు మూడు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమాన్ని శుక్రవారం ఉదయం ఎంబీయూ ప్రొ.ఛాన్సలర్ విష్ణు మంచు ప్రారంభించారు. ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి దాదాపు 20 వేలమందికి పైగా విద్యార్థులు పాల్గొంటున్నారు. ఈసందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మంచు విష్ణు మాట్లాడుతూ ఎంబీయూ విద్యాసంస్థల్లో ప్రతి సంవత్సరం నిర్వహించే మోహన మంత్ర కార్యక్రమం విద్యార్థుల సాంస్కృతిక వేడుక అన్నారు. విద్యార్థుల్లోని సృజనాత్మక శక్తిని, మేధస్సును, నైపుణ్యాన్ని వెలికితీయడానికే ఈ వేడుక నిర్వహిస్తున్నామన్నారు. యూనివర్శిటీలో నిర్వహిస్తున్న వివిధ ఈవెంట్లను ఆయన స్వయంగా వెళ్లి తిలకించారు. కొన్ని ఈవెంట్లలో మంచు విష్ణు పాల్గొని విద్యార్థులతో కలిసి సందడి చేశారు.

ఆకట్టుకున్న ఈవెంట్లు

మోహనమంత్ర కార్యక్రమంలో భాగంగా మొదటి రోజు టెక్నోహాలిక్లో విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో ఎంబెడెడ్ వర్క్‌షాప్, కోడ్ ప్రింట్, లైఫ్ సేవర్, ఈవీ వర్క్‌షాప్‌లు, టెక్ ఎక్స్ ప్రోటోటైప్, ఈవీ ఎక్స్‌పెక్యూజోనోమిక్స్‌లు ఆకట్టుకున్నాయి. కళాక్షేత్ర, స్పోర్ట్స్ ఈవెంట్లలో భాగంగా లెట్స్ నాచో, చికెన్ డిన్నర్(పబ్జీ), కరోకే కెచప్, పుష్ అప్ ఛాలెంజ్, ఎం ప్రాజా ఈవెంట్లు విద్యార్థులను ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి. అలాగే ఫ్రీ ఫైర్, గల్లీ క్రికెట్, మిక్స్ బాస్కెట్ బాల్, ట్రెజర్ హంట్, లక్కీ డ్రా, ఫన్ గేమ్స్, ఫుడ్ ఛాలెంజ్, జార్బింగి బాల్స్ వంటి ఈవెంట్లు ఆకట్టుకున్నాయి. విద్యార్థులు కేరింతల నడుమ మొదటి రోజు కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. ఈక్రమంలో ఎంబీయూ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వినయ్ మహేశ్వరి, వైస్‌ఛాన్సలర్ ఆచార్య నాగరాజ రామరావ్, చీఫ్ గ్రోత్ స్ట్రాటజిక్ ఆఫీసర్ వికాస్ సింగ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సారథి, డీన్లు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఆకర్షణగా ఎంబీయూ ఛాన్సలర్ డాక్టర్ మోహన్ బాబు పాల్గొన్నారు.



డ్రమ్స్ శివమణి కార్యక్రమంలో విద్యార్థుల ఈలలు

నిరీక్షించి.. నీరసించి..!

షెడ్యూల్ ప్రకారం జరగని కౌన్సెలింగ్ ● పూర్తి స్థాయిలో చూపని ఖాళీల జాబితా

● విద్యాశాఖాధికారుల నిర్లక్ష్యంతో కొత్త టీచర్ల అవస్థలు



తిరుపతి (విద్య), అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): షెడ్యూల్ ప్రకారం జరగని కౌన్సెలింగ్‌తో గంటలకొద్దీ నిరీక్షిస్తూ కొత్త టీచర్లు ఇబ్బంది పడ్డారు. ఇందులో విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యమూ కనిపిస్తోంది. మెగా డీఎస్సీ కింద ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఎంపికైన 1403 మంది టీచర్లలో 1394 మంది చిత్తూరు, తిరుపతి, గూడూరులోని ఆరు కేంద్రాల్లో ఎనిమిది రోజుల పాటు.. అక్కడే ఉండి శుక్రవారంతో శిక్షణ పూర్తి చేసుకున్నారు. శిక్షణ కాలంలోనే చివరి రెండు రోజులు వెబ్, మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించి, వీరికి పోస్టింగులు కేటాయించాలి. దీనికిగాను ఎస్జీటీలకు గురువారం మధ్యాహ్నం 3 నుంచి మాన్యువల్, స్కూల్ అసిస్టెంట్లకు వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించాలి. శుక్రవారం సాయంత్రం 4 గంటలకు పూర్తి చేయాలని రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు స్పష్టమైన ఆదేశాలిచ్చారు. జిల్లాలో మాత్రం దీనికి భిన్నంగా జరగడం.. విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతుంది. ఎందుకంటే.. తిరుపతి నగరం జీవకోనలోని విశ్వం స్కూల్‌లో మాన్యువల్ కౌన్సెలింగ్‌కు ఏర్పాట్లను తిరుపతి డీఈవో కేవీఎన్ కుమార్ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం 5 గంటలకు పూర్తి చేశారు. కౌన్సెలింగ్ నిర్వహణకు లాగిన్ అధికారమున్న చిత్తూరు డీఈవో వరలక్ష్మి వివిధ కారణాలతో రాత్రి 10.30 గంటలకు వచ్చారు. దీంతో అర్ధరాత్రి 11 గంటల తర్వాత మొదలై.. శుక్రవారం వేకువ జాము 4 గంటలకు వరకు 250 మందికి కౌన్సెలింగ్ పూర్తి చేశారు. షెడ్యూల్ ప్రకారం మిగిలిన వారికి శుక్రవారం ఉదయం 8.30 గంటలకు తిరుపతి రూరల్ ప్రాంతంలోని మెడ్‌జీ స్కూల్లో 450 మందికి కౌన్సెలింగ్ ప్రారంభించాలి. కానీ, 4.30 గంటలు ఆలస్యంగా మధ్యాహ్నం ఒంటి గంటకు మొదలు పెట్టి రాత్రి పది గంటలకు కౌన్సెలింగ్ పూర్తయింది. ఇక, గూడూరు ఆదిశంకర ఇంజనీరింగ్ కాలేజీలో 175 మంది ఎస్జీటీలకు కౌన్సెలింగ్ నిర్వహించాల్సి ఉండగా, మున్సిపల్, కార్పొరేషన్లకు ఆప్షన్లు పెట్టుకున్న 72 మందికి అక్కడే మధ్యాహ్నం నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు కౌన్సెలింగ్ నిర్వహించారు. మిగతా 103 మందిని తిరుపతిలోని మెడ్‌జీ కేంద్రానికి బస్సుల్లో తరలించారు. చిత్తూరు కేంద్రంలో స్కూల్ అసిస్టెంట్లకు మూడు గంటలు ఆలస్యంగా.. సాయంత్రం 6 గంటలకు మొదలైన వెబ్ కౌన్సెలింగ్ రాత్రి 11.30 గంటల వరకు కొనసాగింది. ఇలా షెడ్యూల్ ప్రకారం కౌన్సెలింగ్ జరగకపోవడానికి సాంకేతిక సమస్యలూ కారణమని అధికారులు చెబుతుండటం గమనార్హం.

ఖాళీలు చూపడంలోనూ స్పష్టత కరువు

ఉమ్మడి జిల్లాలోని టీచర్ పోస్టుల ఖాళీలను పూర్తిగా చూపలేదు. హెచ్ఆర్ఏ 16శాతం, 12 శాతం వచ్చే రెండు కేటగిరిల్లో (కార్పొరేషన్, మున్సిపాలిటీల్లో) 500 ఖాళీలను బ్లాక్ చేశారు. వీటిల్లోనే టీచర్ పోస్టుల ఖాళీలు అధికంగా ఉన్నాయి. నగరాలు, పట్టణాల్లో కనీసం 400 ఖాళీలైనా కొత్త టీచర్లతో భర్తీ చేసుంటే ఈ ప్రాంత విద్యార్థులకు కొంతవరకైనా న్యాయం జరిగేది. అలా కాకుండా కొత్త టీచర్లందరినీ మూడు నాలుగు హెచ్ఆర్ఏ కేటగిరి పరిధిలోకి వచ్చే మండల స్థాయిలోని గ్రామీణ పాఠశాలలకే పరిమితం చేశారు. ఈ ఖాళీలు మాత్రమే జాబితాలో చూపారు.

స్థానాల జాబితాలో తారుమారు

కౌన్సెలింగ్ ప్రక్రియలో సర్వర్లు బిజీగా ఉండటంతో కౌన్సెలింగ్ ఆలస్యానికి మరో కారణంగా తెలుస్తోంది. మరో వైపు కొన్ని ప్రాంతాల ఖాళీలు తప్పుగా నమోదు కావడం, వాటిని సవరించేందుకు సాంకేతిక సిబ్బంది సమయం తీసుకోవడంతో ఇటు విద్యాశాఖ అధికారులు, అటు కొత్త టీచర్లు తలలు పట్టుకున్నారు. ఖాళీలను ప్రచురించిన జాబితాలో పారదర్శకత లేకపోవడంతోనూ కొత్త టీచర్లు విస్తుపోతున్నారు.

ఒత్తిడికి గురై పడిపోయిన చిత్తూరు డీఈవో

చిత్తూరు సెంట్రల్/తిరుపతి(విద్య), ఆంధ్రజ్యోతి: ఎస్జీటీలకు స్థానాల కేటాయింపు కౌన్సెలింగ్ ప్రక్రియలో ఒత్తిడికి గురైన చిత్తూరు డీఈవో వరలక్ష్మి.. శుక్రవారం మధ్యాహ్నం గూడూరు ఆదిశంకర ఇంజనీరింగ్ కాలేజీలో మెట్లు ఎక్కుతూ పడిపోయారు. ఈ కాలేజీలో 175 మంది ఎస్జీటీ (తమిళం, ఉర్దూ ల్యాంగ్వేజస్)లకు ఉదయం 8.30 గంటలకు కౌన్సెలింగ్ ప్రారంభం కావాలి. డీఈవో సకాలంలో వెళ్లకపోవడం, సాంకేతిక కారణాలతో రాష్ట్ర ఐటీ సెల్ నుంచి టీచర్ల కేటాయింపు స్థానాలు డిస్ప్లే కాలేదు. దీంతో మధ్యాహ్నం వరకు మొదలు కాలేదు. దీనిపై విద్యాశాఖ కమిషనరేట్ అధికారులు ఆర్జేడీపై.. కడప నుంచి ఆయనతోపాటు కమిషనరేట్ అధికారులూ డీఈవో వరలక్ష్మిపై ఒత్తిడి తెచ్చారు. ఈ క్రమంలో ఆ కళాశాల ప్రాంగణంలో ఒక చోట మెట్లు ఎక్కబోతూ డీఈవో ఉన్నపాటున పడిపోయారు. సిబ్బంది హుటాహుటిన సమీప ఆసుపత్రికి తరలించి స్కానింగ్ చేయించారు. ప్రాథమిక వైద్యం అందించగా, డీఈవో కోలుకున్నట్లు తెలిసింది.

మద్యం తాగి వాహనం నడిపిన ఒకరికి జైలు శిక్ష

● 15 మందికి జరిమానా

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో మద్యం తాగి వాహనాలు నడిపిన ఒకరికి ఏడు రోజులు జైలు శిక్ష విధిస్తూ తిరుపతి అదనపు జిల్లా న్యాయమూర్తి గ్రంధి శ్రీనివాస్ శుక్రవారం తీర్పు చెప్పారు. మరో 15 మందికి రూ.10వేలు చొప్పున జరిమానా విధించారు.

రిటైర్డ్ తహసీల్దారుపై లోకాయుక్తలో కేసు

బాలాయపల్లి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): నిబంధలనకు విరుద్ధంగా ప్రభుత్వ భూములకు పట్టాదారు పాస్ పుస్తకాలు మంజూరు చేసిన రిటైర్డ్ తహసీల్దారుపై లోకాయుక్తలో కేసు నమోదైంది. 2019 అక్టోబరులో బాలాయపల్లి తహసీల్దారుగా నియమితులైన ఆదిశేషయ్య 18 నెలల పాటు ఆ మండలంలో విధులు నిర్వహించారు. ఆ సమయంలో నిబంధనలకు విరుద్ధంగా రామాపురం గ్రామంలోని ప్రభుత్వ భూములకు పట్టాదారు పాస్ పుస్తకాలు మంజూరు చేశారు. దీనిపై గ్రామస్థులు 2023లో లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం రిటైర్డ్ అయిన తహసీల్దారు ఆదిశేషయ్యపై 1644/2023/బి1 నంబరుతో కేసు నమోదు చేసిన లోకాయుక్త విచారణకు ఆదేశించింది. ఇందుకోసం జాయింట్ కలెక్టర్‌ను విచారణాధికారిగా, గూడూరు ఆర్డీవోను రికార్డుల పరిశీలనకు ప్రజెంటేషన్ అధికారిగా నియమించింది.

హత్య కేసులో నిందితుడికి ఐదేళ్ల జైలు

గూడూరు అర్బన్/ఓజిలి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): హత్యకేసులో నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్ష, రూ.5వేల జరిమానా విధిస్తూ శుక్రవారం ఏడవ అదనపు జిల్లా జడ్జి వెంకటనాగపవన్ తీర్పునిచ్చారు. ఓజిలి మండలం గ్రద్దగుంట గ్రామానికి చెందిన వీరాస్వామి, పోలయ్య పొలం హద్దుల విషయమై 2017 ఏప్రిల్ 10వ తేదీన గొడవ పడ్డారు. ఈ క్రమంలో పోలయ్యపై వీరాస్వామితో పాటు గ్రామానికి చెందిన 9మంది కర్రలతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. ఆస్పత్రిలో పోలయ్య చికిత్స పొందుతూ మృతి చెందాడు. అప్పటి సీఐ సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వీరాస్వామిపై నేరం రుజువు కావడంతో ఐదేళ్ల జైలు శిక్ష, రూ.5వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. ఈ కేసును ఏపీపీ సుందరయ్య వాదించారు.

గువ్వల కాలనీలో యువకుడి హత్య



మెడపైన రక్తగాయంతో చికిత్స పొందుతున్న శ్రీహరి (చనిపోయేముందు)

రేణిగుంట, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): గువ్వల కాలనీలో యువకుడు హత్యకు గురయ్యాడు. ఈ ఘటన శుక్రవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. గాజుల మండ్యం ఎస్ఐ సుధాకర్ కథనం మేర కు.. గువ్వల కాలనీలో ఉంటున్న ఓ మేస్త్రీ తన భార్యతో గొడవపడ్డాడు. ఈ క్రమంలో ఆమె అలిగి పుట్టింటికి వెళ్లిపోయింది. స్థానికంగా ఉన్న కొంతమంది మేస్త్రీ పట్ల అవహేళనగా మాట్లాడడంపై మూడు రోజులుగా గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఉదయం పక్కింటి వారితో మద్యం మత్తులో మేస్త్రీ ఘర్షణపడ్డాడు. ఆ సమయంలో మేస్త్రీని అడ్డుకునే క్రమంలో శ్రీహరి(16) ప్రయత్నించాడు. దీంతో పూసలు చుట్టే కత్తితో మేస్త్రీ అతడి మెడపై దాడి చేయడంతో తీవ్ర గాయాల పాలయ్యాడు. గాయపడిన శ్రీహరిని చికిత్స నిమిత్తం రుయా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. కేసు నమోదు చేశారు.

అన్నప్రసాదం ట్రస్టుకు రూ.10 లక్షల విరాళం



విరాళాన్ని అందజేస్తున్న దర్శన్

తిరుమల, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): టీటీడీ అన్నప్రసాదం ట్రస్టుకు శుక్రవారం రూ.10 లక్షలు విరాళంగా అందింది.టీటీడీ బోర్డు సభ్యుడు దర్శన్ ఈ విరాళాన్ని అందజేశారు. విరాళం డీడీని తిరుపతిలో టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి అందజేశారు.

సీజేపై చెప్పు దాడి ఘటనకు మోదీ బాధ్యత తీసుకోవాలి : చింతా

తిరుపతి(వైద్యం), అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): దేశంలో దళితులపై దాడులు పెరిగాయని, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై చెప్పు దాడి జరిగిందని, వీటికి ప్రధాని నరేంద్రమోదీ బాధ్యత తీసుకోవాలని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ డిమాండ్ చేశారు. సీజేపై చెప్పు దాడి, హరియాణాలో ఎస్సీ డీజీపీపై అక్కడి బీజేపీ ప్రభుత్వం వేధింపులకు నిరసనగా ఆయన కాంగ్రెస్ నేతలతో కలిసి తిరుపతి ఆర్టీసీ బస్టాండు సర్కిల్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద శుక్రవారం ధర్నా చేశారు. మన రాష్ట్రానికి చెందిన ఒక దళిత డీజీపీ హర్యానాలో అక్కడి ప్రభుత్వం పెట్టిన వేధింపులను తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడ్డాడని తెలిపారు.


సంకటహర గణపతి వ్రతం నిర్వహిస్తున్న భక్తులు

కాణిపాకంలో వైభవంగా సంకటహర గణపతి వ్రతం


ప్రాకారోత్సవంలో భాగంగా సిద్ధి, బుద్ధి సమేత వరసిద్ధుడి ఉత్సవర్లను తీసుకొస్తున్న ఈవో పెంచల కిషోర్, తదితరులు

ఐరాల(కాణిపాకం), అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకంలో సంకటహర గణపతి వ్రతాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం మూల విరాట్‌కు అభిషేకం చేశాక సిద్ధి, బుద్ధి సమేత వరసిద్ధుడి ఉత్సవర్లను ఆలయ ఆస్థాన మండపానికి తీసుకొచ్చి, కొలువుదీర్చారు. ఎదురుగా భక్తులను కూర్చోబెట్టి సంకటహర గణపతి వ్రతాన్ని నిర్వహింపజేశారు. పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, ఈవో పెంచలకిషోర్, ఆలయ ప్రధాన అర్చకుడు సోమశేఖర్ గురుకుల్, ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు, ఇన్‌స్పెక్టర్లు చిట్టిబాబు, బాలాజీనాయుడు తదితరులు పాల్గొన్నారు. కాగా, రాత్రి కాణిపాకంలో వర్షం కారణంగా వరసిద్ధుడి స్వర్ణ రథోత్సవాన్ని రద్దు చేసి, ప్రాకారోత్సవాన్ని నిర్వహించారు.

వరసిద్ధుడి సేవలో ప్రముఖులు

కాణిపాక వరసిద్ధుడిని శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వీరిలో.. ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి, టీటీడీ ఆలయాల లోకల్ అడ్వైజరీ కమిటీ ఛైర్మన్ సుమంత్‌రెడ్డిలు కుటుంబీకులతో కలిసి స్వామి సేవలో పాల్గొన్నారు. వేర్వేరుగా వచ్చిన వీరిని ఏఈవో రవీంద్రబాబు ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లు చేశారు. సూపరింటెండెంట్ వాసు, ఆలయ ఇన్‌స్పెక్టర్లు చిట్టిబాబు, బాలాజీనాయుడు, కాణిపాకం ఎస్‌ఐ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

డీటీసీని పరిశీలించిన ఎస్పీ


డీటీసీ భవనాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ తుషార్

చిత్తూరు అర్బన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు ట్రైనింగ్ సెంటర్(డీటీసీ)లో కొత్తగా ఎంపికైన కానిస్టేబుళ్లకు శిక్షణ ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో డీటీసీని శుక్రవారం ఎస్పీ తుషార్ డూడి పరిశీలించారు. బ్యారక్స్ విభాగంలో అభ్యర్థులుండే వసతి గదులు పరిశుభ్రంగా.. గాలి, వెలుతురు ఉండేలా చూడాలన్నారు. అలాగే మైదాన ప్రాంతం, భవన పైభాగాలను పరిశీలించారు. లీకేజీలుంటే సరిచేయాలని ఆదేశించారు. వందలాది మంది భోజనం చేయగల సదుపాయం ఉందా అని అడిగి తెలుసుకున్నారు. తరగతి గదులను పరిశీలించి.. ట్రైనీలు ఎలాంటి అసౌకర్యాలకు గురికాకుండా చూడాలని చెప్పారు. ఫస్ట్ ఎయిడ్, అంబులెన్స్ సదుపాయాలు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. సీసీ కెమెరాల వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని సూచించారు. ఏఎస్పీ శివానంద కిశోర్, ఏఆర్ డీఎస్పీ మహబూబ్ బాష, ఎస్బీ సీఐ మనోహర్, డీటీసీ సీఐ అమరనాథ్‌రెడ్డి, ఆర్‌ఐ చంద్రశేఖర్, డీటీసీ ఆర్‌ఐ వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పాఠాలు చెప్పకపోవడమే అవినీతి
కలెక్టర్ సుమిత్ కుమార్


కొత్త ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్

చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బడుల్లో చదువుతున్న విద్యార్థులకు టీచర్లు పాఠాలు చెప్పకపోవడమే అవినీతి అని కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. మెగా డీఎస్సీ 2025 ద్వారా స్కూల్ అసిస్టెంట్లుగా ఎంపికైనవారికి స్థానిక ఆర్కే ఇంటర్నేషనల్ స్కూల్లో ఏర్పాటు చేసిన శిక్షణ కేంద్రాన్ని చివరి రోజైన శుక్రవారం కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యాశాఖలో అవినీతి చేయలేమని టీచర్లు గర్వంగా చెప్పుకోవడం వాస్తవమేనన్నారు. అదే టీచర్లు ప్రభుత్వ బడుల్లోని విద్యార్థులకు పాఠాలు చెప్పకపోవడం అవినీతి కిందకే వస్తుందన్నారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే అవకాశం కేవలం ఒక్క టీచర్‌కే ఉంటుందని గుర్తుంచుకోవాలని సూచించారు. ఉద్యోగంలో చేరిన తొలి రోజు నుంచి పదవీ విరమణ పొందే రోజు వరకు ఒకే రకమైన ఉత్సాహంతో ఉపాధ్యాయులు నిస్వార్థంగా పనిచేస్తే, ఎంతో మంది విద్యార్థులను భావితరాలకు ప్రయోజకులు చేయవచ్చన్నారు. సమావేశంలో ఏపీసీ వెంకటరమణ, కో-ఆర్డినేటర్లు, విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

చేపల వేటకు వెళ్లి జాలరి మృతి


ఓబులేష్ మృతదేహం

కల్లూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): చెరువులో చేపల వేటకు వెళ్లి సత్యసాయి జిల్లాకు చెందిన ఓ జాలరి ప్రమాదవశాత్తు మునిగిపోవడంతో మృతి చెందిన సంఘటన పులిచెర్ల మండలం ఎర్రపాపిరెడ్డిగారిపల్లి పంచాయతీలో గురువారం జరిగింది. కల్లూరు పోలీసుల కథనం మేరకు.. సత్యసాయి జిల్లా నల్లమాడ మండలం సుబ్బరాయనిపల్లికి చెందిన ఓబులేష్ (48) కొన్నేళ్లుగా అన్నమయ్య పీలేరు పరిసర ప్రాంతాల్లో చేపల వేటకు వచ్చి వెళ్లేవాడు. ఈ నేపథ్యంలో గతనెల 27వ తేదీన ఓబులేష్ తన స్వగ్రామం నుంచి పులిచెర్ల మండలం ఎర్రపాపిరెడ్డిగారిపల్లి పంచాయతీకి చెందిన శ్రీనివాసులు వద్దకు వచ్చాడు. అతడి ఇంటి వద్దే ఉంటూ సమీపంలోని కృష్ణమ్మచెరువులో చేపలు పడుతుండేవాడు. రోజూ మాదిరిగానే గురువారం ఉదయం ఓబులేష్ వల తీసుకొని చేపలు పట్టేందుకు కృష్ణమ్మచెరువు వద్దకు వెళ్లాడు. అయితే మధ్యాహ్నం అవుతున్నా ఓబులేష్ తిరిగి ఇంటికి రాకపోవడంతో శ్రీనివాసులు చెరువు వద్దకెళ్లి చూడగా కట్టపై చెప్పులు, దుస్తులు ఉండటం గుర్తించాడు. దీంతో ఆందోళన చెందిన శ్రీనివాసులు గ్రామస్తులకు సమాచారం ఇచ్చి ఓబులేష్ కోసం చెరువులో గాలింపు చర్యలు చేపట్టారు. రాత్రి సుమారు 7 గంటల సమయంలో చెరువులో నుంచి ఓబులేష్ మృతదేహాన్ని వెలికితీసి పీలేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. శుక్రవారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పల్లికొండేశ్వరాలయ పాలకమండలి ప్రమాణ స్వీకారం

నాగలాపురం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): నాగలాపురం మండలం సురుటుపల్లిలోని పల్లికొండేశ్వర ఆలయ పాలక మండలి శుక్రవారం మధ్యాహ్నం ప్రమాణ స్వీకారం చేసింది.ఈవో లత ఆధ్వర్యంలో ఛైర్మన్‌గా పిచ్చాటూరు మండలం కీళపూడికి చెందిన టీడీపీ నేత పద్మనాభరాజు, సభ్యులుగా హంస, శ్రీనివాసులు, జయంతి, నెల్సన్ మండేలా, దేవి, కవిత, హేమంత్‌కుమార్, నాగభూషణమ్మ ప్రమాణం చేశారు.పాలకమండలి నియామకానికి ప్రభుత్వం గురువారం రాత్రి జీవో విడుదల చేయగా శుక్రవారం మధ్యాహ్నం ఆలయ ఈవోకు ఉత్తర్వులు అందాయి. గంటల వ్యవధిలోనే సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. కాగా, పాలక మండలి సభ్యుడిగా నియమితులైన సత్యవేడు మండలానికి చెందిన కృష్ణయ్య యాదవ్ పదవీ ప్రమాణ స్వీకరణ కార్యక్రమానికి గైర్హాజరయ్యారు. ఈయన ఛైర్మన్ పదవి కోసం తీవ్రంగా ప్రయత్నాలు చేశారు.

అక్రమాల ‘వెలుగు’

రుణాల రికవరీ సొమ్ము స్వాహా చేసిన నలుగురు సంఘమిత్రల తొలగింపు

వెదురుకుప్పం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): వెలుగు సంఘాల్లో ఉన్న ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గ సంఘాలకు ‘ఉన్నతి’ పథకంలో భాగంగా వడ్డీలేని రుణాలను మంజూరు చేస్తారు. ఈ రుణాల మంజూరులోనే అవకతవకలు జరిగాయి. చివరకు రికవరీ చేసిన డబ్బులను కూడా ఓ నలుగురు సంఘమిత్రలు బ్యాంకుల్లో జమ చేయలేదని గుర్తించి, వారిని విధుల నుంచి తొలగించారు. మిగతా సంఘమిత్రల పరిధిలోనూ ఇటువంటి అక్రమాలే జరిగాయన్న విమర్శలున్నాయి.

బయటపడిందిలా...

‘ఉన్నతి’ పథకంలో ఇచ్చిన సొమ్ము వివరాలను పొందుపరచడానికి యాక్షన్ క్రెడిట్ లైవ్‌హుడ్ ప్లాన్(ఏసీఎల్‌పీ) పేరుతో యాప్‌ను కొత్తగా ఇచ్చారు. ఇందులో భాగంగా సీసీ జీవ, డీపీఎం అరుణ, డీఎంజీ సుధాకర్, ఎంఎస్‌వోబీస్ కమిటీగా సర్వేకు వెళ్లిన సందర్భంగా స్వాహా వ్యవహారం వెలుగుచూసింది. తిరుమలయ్యపల్లె గ్రామ పంచాయతీ ఏసు వీవోలో సంఘమిత్ర సుబ్రహ్మణ్యంరెడ్డి.. వసూలు చేసిన రూ.4లక్షల75వేలు సొంత అవసరాలకు వాడుకున్నారు. ఇదే గ్రామ పంచాయతీలో ఏసుమ్యాక్స్ గ్రామసమైక్య నుంచి ఏడు లక్షల నాలుగు వేల 313 రూపాయలను సంఘ మిత్ర శేషాద్రి తన సొంత అవసరాలకు వాడేశారు. బొమ్మయ్యపల్లె గ్రామ పంచాయతీ తెల్లగుండ్లపల్లెకు చెందిన సంఘమిత్ర నీలవేణి తన పరిధిలో రూ.3లక్షల 51వేలను వసూలు చేసి స్వాహా చేశారు. యనమలమంద విష్ణుప్రియ గ్రామ సమైక్య నుంచి వసూలు చేసిన రూ.3లక్షల 27వేలను సంఘమిత్ర రేవతి స్వాహా చేశారు. ఈ నలుగురినీ విధుల నుంచి ప్రభుత్వం తొలగించింది.

అంగీకరించిన సంఘమిత్రలు

వసూలు చేసిన డబ్బులను సొంత అవసరాలకు వాడుకున్నామని సంఘమిత్రలు.. రేవతి, నీలవేణి, సుబ్రహ్మణ్యంరెడ్డి, శేషాద్రి లిఖిత పూర్వకంగా వెదురుకుప్పం వెలుగు కార్యాలయం అంగీకరిస్తూ పత్రాలు రాసిచ్చారు. వీరిలో శేషాద్రి రూ.లక్ష, రేవతి రూ.45వేలను తిరిగి చెల్లించారు.

విచారణ అధికారిగా డీఆర్‌డీఏ ఏపీడీ

వెలుగులో స్వాహాయణంపై విచారణ అధికారిగా డీఆర్‌డీఏ ఏపీడీ రవికుమార్‌ను పీడీ శ్రీదేవి నియమించారు. విచారణ పూర్తయ్యాక మరిన్ని విషయాలు వెలుగు చూడనున్నాయి.


వెదురుకుప్పం వెలుగు కార్యాలయం



స్వాహా నిజమే

ఉన్నతి పథకం కింద 30 ఎస్సీ, ఎస్టీ సంఘాలకు 2014లో వడ్డీలేని రుణాలను సుమారు రూ.74 లక్షలు మంజూరు చేశారు. తర్వాత రికవరీ కింద వసూలు చేసిన డబ్బులను సంఘమిత్రలు సుబ్రహ్మణ్యంరెడ్డి, శేషాద్రి, రేవతి, నీలవేణి స్వాహా చేసింది నిజమే. ప్రభుత్వం వారిని విధుల నుంచి తొలగించింది. రికవరీకి చర్యలు చేపట్టాం.

- పి.పరశురామిరెడ్డి, ఏపీఎం, వెలుగు, వెదురుకుప్పం



ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, మేయర్ అముద - ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్

జీఎస్టీ 2.0పై అవగాహన అవసరం

● సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించిన కలెక్టర్


ఎగ్జిబిషన్‌లోని స్టాళ్ల వద్ద జనం

చిత్తూరు రూరల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ 2.0పై వినియోగదారులు అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ సుమిత్ కుమార్ సూచించారు. శుక్రవారం స్థానిక జ్యోతిరావు పూలే బీసీ భవన్‌లో కమర్షియల్ ట్యాక్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ ఎగ్జిబిషన్‌ను మేయర్ అముదతో కలిసి కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం సామాన్యుడికి మేలు కలిగే జీఎస్టీ 2.0 ద్వారా పన్ను విధానంలో సంచాలనాత్మకమైన మార్పులు తీసుకువచ్చిందన్నారు. ఇందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలతో జిల్లాలో విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నామన్నారు. 44 స్టాళ్లతో ఏర్పాటు చేసిన ఈ ఎగ్జిబిషన్ రెండ్రోజులపాటు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్, ఈఈలు మునిచంద్ర, సురేష్ వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.

15 రోజుల సెలవుపై కార్వేటినగరం ఎంపీడీవో



వెదురుకుప్పం, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి):అవినీతి ఆరోపణల్లో చిక్కుకున్న కార్వేటినగరం ఎంపీడీవో టి.చంద్రమౌళి 15 రోజుల సెలవుపై వెళ్లారు.ఇక్కడ బాధ్యతలు చేపట్టిన కొన్నిరోజులకే ఎంపీడీవో కార్యాలయ మరమ్మతు పనులు మొదలుకుని, గ్రామాల్లో అభివృద్ధి పనులకు పర్సంటేజీలు అడుగుతారన్న ఆరోపణలు ఆయన ఎదుర్కొంటున్నారు.తాజాగా కార్వేటినగరంలో ఓ టపాసుల దుకాణం కొనసాగించాలంటే రూ.4లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేసి రూ.20వేలు అడ్వాన్సుగా తీసుకున్నారంటూ ఎమ్మెల్యే దృష్టికి టీడీపీ నాయకులు తీసుకెళ్లారు.కొల్లాగుంట వద్ద టపాసుల దుకాణ అనుమతికి రూ.30వేలు ఇవ్వాలని కోరడంతో పాటు అభివృద్ధి పనులకు రెండు శాతం పర్సంటేజీ ఇవ్వాలని ఇబ్బంది పెడుతున్నట్లు టీడీపీ మండల అధ్యక్షుడు చెంగల్రాయయాదవ్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. సురేంద్రనగరంలోని 22 హెక్టార్ల స్థల లావాదేవీల్లో కూడా భారీ మొత్తంలో డబ్బు తీసుకున్నట్లు ఎమ్మెల్యేకి చెప్పారు.దీనిపై విచారించిన ఎమ్మెల్యే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు.ఈ నేపథ్యంలో శుక్రవారం నుంచి ఎంపీడీవో చంద్రమౌళి సెలవుపై వెళ్లినట్లు తెలిసింది. జడ్పీ సీఈవో రవికుమార్‌ను అడగ్గా సెలవుపై వెళ్లిన మాట నిజమేనన్నారు.ఆయన బాధ్యతలను తాత్కాలికంగా వేరేవాళ్లకు అప్పగించడానికి చర్యలు చేపడతామన్నారు.

10వ రోజుకు చేరిన పీహెచ్‌సీ వైద్యుల ధర్నా

చిత్తూరు రూరల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ చిత్తూరు డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట పీహెచ్‌సీ వైద్యులు ధర్నా కొనసాగిస్తున్నారు. శుక్రవారంతో వీరి నిరసన పదో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ.. ఇన్ని రోజులుగా విధులు మానేసి ధర్నా చేస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే తమకు టైమ్ బౌండ్ ప్రమోషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ శిరీషా, వైద్యాధికారులు పాల్గొన్నారు.

ఇళ్లలో దొంగతనం.. పొలాల్లో బస..!

సీసీ కెమెరాల్లేని దారినే ఎంచుకుంటాడు ● ఎట్టకేలకు పట్టుబడ్డ అంతర్రాష్ట్ర దొంగ
● 210 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.2లక్షలు, ద్విచక్ర వాహనం స్వాధీనం


నిందితుడి వివరాలు తెలియజేస్తున్న డీఎస్పీ సాయినాథ్

చిత్తూరు అర్బన్,అక్టోబరు10(ఆంధ్రజ్యోతి): ఇళ్లల్లో దొంగతనం చేస్తాడు.. పొలాల్లో బస చేస్తాడు. సీసీ కెమెరాల్లేని దారినే ఎంచుకుంటూ.. పోలీసులకు చిక్కకుండా తిరుగుతున్న అంతర్రాష్ట్ర దొంగను ఎట్టకేలకు అరెస్టు చేశారు. అతడి వద్ద నుంచి 210 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.2లక్షలు, ఓ ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. వివరాలను రెండో పట్టణ సీఐ నెట్టికంఠయ్య, ఎస్‌ఐ రమేష్‌బాబులతో కలిసి పాత డీపీవో కార్యాలయంలో చిత్తూరు డీఎస్పీ సాయినాథ్ శుక్రవారం మీడియాకు తెలిపారు. గత నెల 30వ తేదీన చిత్తూరు రాంనగర్‌కాలనీలో అల్తాఫ్ ఇంట్లో జరిగిన దొంగతనంపై రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా రెండు బృందాలుగా విడిపోయి మన రాష్ట్రంతోపాటు కర్ణాటక, తమిళనాడుల్లోనూ దొంగ కోసం గాలింపు చేపట్టారు. లభించిన ఆధారాలకు సాంకేతికతను జోడించారు. ఈ నేపథ్యంలో రెండో పట్టణ పోలీసులకు అందిన పక్కా సమాచారంతో శుక్రవారం నిందితుడైన కర్ణాటక రాష్ట్రం బళ్లారి జిల్లా కరుమారియమ్మకాలనీకి చెందిన హనుమంతప్ప(27)ను చిత్తూరు శివారులోని బాస్ హోటల్ వద్ద అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద నుంచి చిత్తూరు నగరంలో చోరీ చేసిన 150 గ్రాముల బంగారు నగలు, అనంతపురం జిల్లాలో దోచుకున్న 60 గ్రాముల బంగారు నగలు కలిపి మొత్తం 210 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.2లక్షల, ఓ ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఇవన్నీ కలిపి రూ.25లక్షలు ఉంటాయని డీఎస్పీ తెలిపారు. అనంతరం నిందితుడిని జైలుకు తరలించారు.

బస్సు ఎక్కడు.. ఒక్కడే వెళతాడు : చోరీలు చేయడంలో హనుమంతప్ప ఎంచుకున్న మార్గం చూసి పోలీసులే అవాక్కయ్యారు. ఎంత దూరమైనా బస్సు ఎక్కడు.. పైగా ఒక్కడే వెళతాడు. సెల్‌ఫోన్ తీసుకెళ్లడు. తాళం వేసిన ఇంటినే ఎంచుకుంటారు. చోరీ చేశాక పరిసర ప్రాంతాల్లోని వ్యవసాయ పొలాల్లోనే నిద్రపోతాడు. ఆ మరుసటి రోజు ద్విచక్ర వాహనంలో వెళ్లిపోతాడు. ఇతడిపై కర్ణాటక రాష్ట్రంలోని సోలాపూర్, హుబ్బలి, చిత్తూరు, అనంతపురం జిల్లాల్లో కేసులు నమోదై ఉన్నాయి. చోరీ చేసిన డబ్బుతో జల్సాలు చేసేవాడని పోలీసులు తెలిపారు.

కొబ్బరికాయల వ్యాపారుల నిజాయితీ

కాణిపాకంలో పోగొట్టుకున్న నగదు భక్తుడికి అప్పగింత


దుర్గారావుకు నగదు అందిస్తున్న ఏఈవో రవీంద్రబాబు

ఐరాల(కాణిపాకం), అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): కాణిపాకంలో ఓ భక్తుడు పోగొట్టుకున్న నగదును కొబ్బరికాయల వ్యాపారులు గుర్తించి, ఆలయ సిబ్బందికి అందజేసి తమ నిజాయితీని చాటుకున్నారు. వివరాలను వరసిద్ధుడి ఆలయ ఏఈవో రవీంద్రబాబు మీడియాకు తెలిపారు. రాజమండ్రికి చెందిన దుర్గాప్రసాద్ తన స్నేహితులతో కలసి వరసిద్ధుడి దర్శనార్థం కాణిపాకం విచ్చేశారు. బస్టాండ్ ప్రాంతంలో తన జేబులోంచి ఫోన్ తీస్తున్నప్పుడు 11వేల రూపాయలు పడిపోయాయి. ఆయన దాన్ని గుర్తించకుండా వెళ్లిపోయాడు. ఈ డబ్బును అక్కడ కొబ్బరికాయల వ్యాపారం చేసుకునే వాళ్లు గుర్తించారు. ఆ నగదును తీసుకొచ్చి ఆలయ హోంగార్డు ఇన్‌చార్జి వినాయకంకు అందజేశారు. ఆయన ఏఈవోకు సమాచారం ఇచ్చారు. ఏఈవో మైక్ ద్వారా భక్తులకు విషయాన్ని తెలియజేశారు. దుర్గారావు వచ్చి ఏఈవోను కలిసి తగిన ఆధారాలను తెలియజేయడంతో నగదును అప్పగించారు. ఈ సందర్భంగా కొబ్బరికాయల వ్యాపారులను, ఆలయ సిబ్బందికి దుర్గారావు కృతజ్ఞతలు తెలిపాడు.

అభివృద్ధి పనులకు నిధుల కొరత లేదు

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అభివృద్ధి పనులకు నిధుల కొరత లేదని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు.15వ ఆర్థిక సంఘం, జడ్పీ నిధులు మంజూరు చేస్తామన్నారు.పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల్లో జరుగుతున్న అభివృద్ధి పనులపై కలెక్టరేట్ నుంచి శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సమీక్షించారు. నవంబరు లోగా ఎస్సీ ఎస్టీ కాలనీల్లో తాగునీటి సమస్య లేకుండా పనులు చేపట్టాలని ఆదేశించారు. కాలనీల్లో మౌలిక వసతుల పనులు పూర్తిచేయాలన్నారు. గ్రామాల్లో స్వచ్ఛమైన తాగునీరందించడానికి పైపులైన్లు, పంపుసెట్లు, విద్యుత్ సౌకర్యం, విద్యుత్ మీటర్లు మొదలైనవి అమర్చారో లేదో పరిశీలించాలన్నారు. విజయపురం మండలం సిరిపురం ఎస్టీకాలనీలో 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ. 1.20 లక్షలతో పనులు పూర్తిచేయాలన్నారు. నింద్ర మండలం అత్తూరులో తాగునీటి పైప్‌లైన్ల పనులు, విజయపురం మండలం ఇల్లత్తూరు, కోసలనగరం, జంబాడ ప్రాంతాల్లో పైప్‌లైన్లు అమర్చాలని ఆదేశించారు. జరిగిన పనులకు బిల్లులు చెల్లించేటప్పుడు డీఈ చెక్‌లిస్టుతో జడ్పీ సీఈవోకు బిల్లులు పంపాలన్నారు.జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ విజయ్‌కుమార్, పీఆర్ ఎస్ఈ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రియుడితో కలిసి భర్తనే హత్య చేసింది!

● నిందితుల అరెస్టు.. రిమాండ్‌కు తరలింపు

చిత్తూరు అర్బన్,అక్టోబరు10(ఆంధ్రజ్యోతి): వివాహేతర సంబంధం పెట్టుకుంది. ఆపై ప్రియుడితో కలిసి భర్తనే హత్య చేసింది. చివరకు ఇద్దరూ కటకటాల పాలయ్యారు. వివరాలను పాత డీపీవో కార్యాలయంలో రెండో పట్టణ సీఐ నెట్టికంఠయ్య, ఎస్‌ఐ రమేష్‌బాబులతో కలిసి చిత్తూరు డీఎస్పీ సాయినాథ్ శుక్రవారం మీడియాకు తెలిపారు. చిత్తూరు సంతపేట దుర్గమ్మగుడి వీధిలో వెంకటేశ్, అతడి రెండో భార్య మునియమ్మ, పిల్లలు నివాసముంటున్నారు. ఈనెల ఆరో తేదీన వెంకటేష్ అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం రిపోర్టు, మృతుడి తల్లి ఇచ్చిన ఫిర్యాదుతో హత్య కేసుగా మార్చి దర్యాప్తును వేగవంతం చేశారు. కొంతకాలంగా మునియమ్మకు సురేష్ అనే వ్యక్తితో వివాహేతర సంబంధం ఉందని తెలియడంతో దంపతుల మధ్య తరచూ గొడవలు జరిగేవి. ఈ క్రమంలో తమకు అడ్డుగా ఉన్న వెంకటేష్‌ను చంపేయాలని మునియమ్మ ఆమె ప్రియుడు సురేష్ నిశ్చయించుకున్నారు. పథకం ప్రకారం.. ఈనెల ఆరో తేదీ సాయంత్రం ఇంట్లో నిద్రపోతున్న వెంకటేష్ గొంతుకు తాడును బిగించి చంపేశారు. ఆతర్వాత ఆత్మహత్యగా చిత్రీకరించారు. దాంతో మునియమ్మ, సురేష్‌లను గురువారం అరెస్టు చేసి, వారి వాంగ్మూలాన్ని రికార్డు చేశాక శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. ఈ కేసును ఛేదించిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ తుషార్ డూడి ప్రత్యేకంగా అభినందించినట్లు డీఎస్పీ వెల్లడించారు.

మానసిక రోగులను అవమానించొద్దు


ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవంలో పాల్గొన్న వైద్య ప్రముఖులు

కుప్పం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మానసిక రోగులను అవమానించేలా మన ప్రవర్తన ఉండరాదని పీఈఎస్ కాలేజ్ ఆఫ్ నర్సింగ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.అభిరామి అన్నారు. పీఈఎస్ ఆస్పత్రిలోని సైకియాట్రి ఓపీడీలో సైకియాట్రీ విభాగం, మానసిక ఆరోగ్య నర్సింగ్ విభాగం, పీఈఎస్ కాలేజ్ ఆఫ్ నర్సింగ్ ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్లు, నర్సుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ మానసిక దినోత్సవాన్ని నిర్వహించారు. పీఈఎస్ నర్సింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ క.డేనియల్ అరుణ్ కుమార్, సీనియర్ రెసిడెంట్ డాక్టర్ మనిషా, చైల్డ్ హెల్త్ నర్సింగ్ హెడ్ ప్రొఫెసర్ శుభ వెల్విజి, ఎస్ఎన్ఏ సలహాదారు ప్రొఫెసర్ టీకే.శ్రీదేవి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎం.మెల్విన్ డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో జీసీడీవో, ఎంఈవో తదితరులు

రామకుప్పం/శాంతిపురం: శాంతిపురం మండలం కడపల్లె వద్ద ఉన్న కేజీబీవీ విద్యార్థులకు మానసిక ఆరోగ్యంపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా బాలికా అభివృద్ధి అధికారి ఇంద్రాణీతో పాటు మానసిక ఆరోగ్య కౌన్సిలర్లు చామంతి, మహేశ్వరి, మనీష్‌రెడ్డిలు విద్యార్థులకు తీసుకోవాల్సిన చర్యలపై విద్యార్థులకు వివరించారు. ఎంఈవో చంద్రమ్మ, కేజీబీవీ ప్రిన్సిపాల్ జమున పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌కు సత్కారం


మున్సిపల్ కమిషనర్‌ను సన్మానిస్తున్న రాజ్‌కుమార్ తదితరులు

కుప్పం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయిలో స్వచ్ఛాంధ్ర అవార్డును ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతులమీదుగా తీసుకున్న కుప్పం మున్సిపల్ కమిషనర్ వి.శ్రీనివాసరావును శుక్రవారం కడా రాజకీయ సలహా మండలి సభ్యుడు రాజ్‌కుమార్, రెస్కో చైర్మన్ వీజీ.ప్రతాప్, టీడీపీ కుప్పం మున్సిపల్ అధ్యక్షుడు కాణిపాకం వెంకటేశ్, ఏఎంసీ మాజీ చైర్మన్ సత్యేంద్ర శేఖర్ సత్కరించారు. కుప్పం మున్సిపాలిటీని అభివృద్ధి చేస్తూ మరిన్ని అవార్డులు అందుకోవాలని కమిషనర్‌ను అభినందించారు.

నేడు విద్యుత్తు అంతరాయం

కుప్పం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): కుప్పం 132 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 7 నుంచి ఉదయం 10 గంటల వరకు కుప్పం టౌన్, గుడుపల్లె మండలాల పరిధిలో ఉదయం 7 నుంచి 10 గంటల వరకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం కలుగుతుందని కుప్పం రెస్కో ఎండీ సోమశేఖర్ తెలిపారు. మెరుగైన విద్యుత్తు సరఫరా కోసం మరమ్మతులు చేపడుతున్నందున వినియోగదారులు సహకరించాలని కోరారు.

జీఎస్టీ సంస్కరణలతో అన్ని వర్గాలకు ఊరట


కుప్పంలో తగ్గిన జీఎస్టీ ధరల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల తదితరులు


పలమనేరులో జీఎస్టీ కరపత్రాలు విడుదల చేస్తున్న మున్సిపల్ కమిషనర్, జీఎస్టీ అధికారులు

కల్లూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ సంస్కరణలతో దేశంలోని అన్ని వర్గాల ప్రజలకు ఊరట లభించిందని ఇన్‌చార్జి ఎంపీడీవో మునిరాజ, మండల జీఎస్టీ నోడల్ అధికారి సాబ్‌జాన్ తెలిపారు. పులిచెర్ల మండలం కల్లూరులో శుక్రవారం జీఎస్టీపై వ్యాపారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి నాగరాజు, సీనియర్ అసిస్టెంట్ శేషు, టీడీపీ, బీజేపీ నాయకులు కరుణాకర్ నాయుడు, అష్రఫ్, అనిల్‌కుమార్, రాజేష్, పార్థసారధి, సర్దార్, సిబ్బంది పాల్గొన్నారు.

● **కుప్పం:** నిత్యావసరాలు, ఎలక్ట్రానిక్ వస్తువులపై జీఎస్టీని గణనీయంగా తగ్గించడంతో కేంద్ర, రాష్ట్రాలలో అధికారంలో ఉన్న ఎన్డీయే ప్రభుత్వాలు ప్రజలకు దసరా, దీపావళి కానుకను అందించాయని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం, పీకేఎం ఉడా చైర్మన్ డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు, కడా పీడీ వికాస్ మర్మత్ అన్నారు. కడా ఆధ్వర్యంలో కుప్పం మండల సచివాలయంలోని సమావేశపు హాలులో శుక్రవారం ఏర్పాటు చేసిన ఎలక్ట్రానిక్ వస్తువుల మేళాను ప్రారంభించారు. టీటీడీ బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం, కడా సలసహా మండలి సభ్యుడు రాజ్‌కుమార్, మున్సిపల్ చైర్మన్ సెల్వరాజ్, టీడీపీ మున్సిపల్ అధ్యక్షుడు కాణిపాకం వెంకటేశ్, ఏఎంసీ మాజీ చైర్మన్ సత్యేంద్ర శేఖర్, ఆర్‌ఆర్.రవి, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

● **రామకుప్పం:** ఎన్డీయే ప్రభుత్వం జీఎస్టీ తగ్గించడంతో అన్నివర్గాల ప్రజలకు ఊరటనిస్తుందని జీఎస్టీ జిల్లా డిప్యూటీ కమిషనర్ ఇంతియాజ్‌అహ్మద్ తెలిపారు. శుక్రవారం రామకుప్పం పట్టణంలో జీఎస్టీపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు వస్తువుల ప్రదర్శన మేళాను ప్రారంభించారు. ఇన్‌చార్జి ఎంపీడీవో మురళీధర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ సీతాపతి పాల్గొన్నారు.

● **పలమనేరు:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పలమనేరు పరిధిలో వివిధ సంస్థలతో స్టాళ్లను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జీఎస్టీకు సంబంధించి కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ శ్రీహరిప్రసాద్, మున్సిపల్ మేనేజర్ ఖాదర్‌మొహిద్దీన్, మెప్మా సీఎంఎం వి.బాబా, కురబ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ సుబ్రహ్మణ్యంగౌడు, టీడీపీ కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

● **వి.కోట:** ప్రభుత్వం జీఎస్టీని తగ్గించడం సామాన్య ప్రజలకు మేలు చేకూరిందని రాష్ట్ర వేర్‌హౌస్ డెవలప్‌మెంట్ డైరెక్టర్, టీడీపీ మండలాధ్యక్షుడు రంగనాథ్ అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయం వద్ద జీఎస్టీపై రైతులకు అవగాహన కల్పించారు. నోడల్ అధికారి యుగంధర్‌నాయుడు, ఎంపీడీవో వెంకటేశ్వరావు, ఎంఈవో చంద్రశేఖర్, ఏఎంసీ మాజీ చైర్మన్ రామచంద్రనాయుడు, జిల్లా అధికార ప్రతినిధి రాంబాబు, రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ గజేంద్ర, పీఏసీఎస్ అధ్యక్షులు హరినాథరెడ్డి, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

జనరల్ నోటీసు

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడము ఏమనగా ఈ క్రింది షెడ్యూలు దాఖలా భూములపై చిత్తూరు 9వ అదనపు జిల్లా జడ్జి గారి కోర్టు నందు O.S.No. 56/2018 పెండింగ్‌లో కలదు. సదరు కోర్టు Injunction Orders ఇచ్చియున్నారు. కావున ప్రతివాదులైన **V.S.Balaji, P.Gopinath, B.M.K. Ravichandra Babu** ఏవిధమయిన రిజిస్ట్రేషనులు చేయరాదు. ఎవరైనా ఈ క్రింది షెడ్యూలు దాఖలా భూములు కొన్నా అవి చెల్లనేరవు. ఇందుమూలముగా తెలియజేయడమైనది.

SCHEDULE

Chittoor Dist., Sri Balaji Reg. District - Kuppam, Sub District - Kuppam Mandal - Kuppam Gramapanchayath No. 128, Kamathamooru Road, Dry, S.N. 102-2, an extent & Ac. 1-76 cents, 0-172 Hectors within the following boundaries. East - Land of Chinna Dorai and Defendants land., West : Cart track leading to Kamathamuru, North : Road leading to Kamathamuru and Chinna Dorai land, South : Defendants own land. Within in these boundaries Wet S.No. 100-2B/1 an extent of A.c. 0-12 cents or 0-049 Hectors with in the boundaris : East - Lands of Sundarappa; West - Burial Grounds, North - Lands of Seenappa, South - Road.

D.REDDEPPA REDDY, G.BABU,
Advocates, Chittoor

ఆదర్శ పాఠశాలలో తాగునీటి సమస్యను పరిష్కరించాలి



రామకుప్పం/శాంతిపురం, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): శాంతిపురం ఆదర్శ పాఠశాలలో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కడ పీడీ వికాస్‌మర్మత్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన ఆదర్శ పాఠశాలలో వసతులను పరిశీలించారు. త్వరలోనే పాఠశాల ఆవరణలో బోరుబావి తవ్వి, తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఆయన అధికారులను ఆదేశించారు. బోరుబావి తవ్వే వరకు పాఠశాలను నీరు సరఫరా చేయాలని పీడీ రైతు లోకేశ్‌ను కోరగా ఆయన సమ్మతించారు.

ఔషధాల దుర్వినియోగం నేరం


ఫార్మా సదస్సు ప్రారంభిస్తున్న రాజకీయ, అధికార ప్రముఖులు

కుప్పం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): నార్కోటిక్, మానసికంగా చెడు ప్రభావం కలిగించే ఔషధాల దుర్వినియోగం సమాజానికి తీవ్రమైన ముప్పు కలిగిస్తాయని, అలాంటి ఔషధాల దుర్వినియోగం ఎన్‌డీపీఎస్ చట్టం ప్రకారం నేరమని, అందుకు కఠిన శిక్షలు తప్పవని ముఖ్యులు హెచ్చరించారు. కుప్పంలో శుక్రవారం కుప్పం కెమిస్ట్ అండ్ డ్రగిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫార్మా ట్రేడర్స్ మెడికల్ షాపులు, ఔషధ వ్యాపారుల కోసం అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో నార్కోటిక్స్, యాంటీ బయాటిక్స్ సరైన వినియోగం, అలాగే ఫార్మా రంగంలో జీఎస్టీ 2.0 అమలు మార్గదర్శకాల వివరణాత్మక చర్చ చేశారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం, పీఎంకే ఉడా చైర్మన్ డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు, కడా పీడీ వికాస్ మర్మత్, మున్సిపల్ చైర్మన్ సెల్వరాజ్‌లు మాట్లాడుతూ ఫార్మసిస్టులు ఔషధ విక్రయాల కోసం రూపొందించిన నియమాలు తప్పకుండా పాటించాలన్నారు. కార్యక్రమంలో ఫార్మసిస్టులు, ఫార్మా డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

సమతుల్య ఆహారంతో ఆరోగ్యం

కుప్పం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): సమతుల్య ఆహారాన్ని మితంగా తీసుకోవడంతో చక్కటి ఆరోగ్యం సమకూరుతుందని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం, పీకేఎం ఉడా చైర్మన్ డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు అన్నారు. కుప్పంలో శుక్రవారం 8వ రాష్ట్రీయ పోషణ్ మాసంలో భాగంగా ఐసీడీఎస్ కుప్పం ప్రాజెక్టు ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. నర్సింగ్ కాలేజి ప్రిన్సిపాల్ ఎం.అభిరామి మాట్లాడుతూ మానసిక రోగులకు మర్యాద పూర్వకమైన సాంత్వన అందివ్వాలని సూచించారు. విద్యార్థులు, స్వచ్ఛంద సేవకులు చురుగ్గా హాజరయ్యారు.ఐసీడీఎస్ కుప్పం, శాంతిపురం సీడీపీవోలు ఎం.చంద్రకళ, ఎస్.కల్పన సూపర్‌వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలు, ఐసీడీఎస్ సీనియర్ అసిస్టెంట్ ఉదయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అధునాతన సాంకేతికతను అందిపుచ్చుకోవాలి


కేఈసీలో సదస్సు సావనీర్ ఆవిష్కరిస్తున్న బీసీఎన్ తదితరులు

కుప్పం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ విద్యార్థులు ప్రపంచ వ్యాప్తంగా వస్తున్న అధునాతన సాంకేతికతపై అవగాహన పెంచుకోవాలని బీసీఎన్ విద్యా సంస్థల చైర్మన్ బీసీ.నాగరాజ్, కేఈసీ వైస్ చైర్మన్ డాక్టర్ సునీల్ రాజ్ అన్నారు. కుప్పం ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం 'స్మార్ట్ సిస్టమ్స్ ఫర్ సస్టైనబుల్ డెవలప్‌మెంట్ యూజింగ్ అడ్వాన్స్‌డ్ కంప్యుటేషనల్ టెక్నిక్స్' అనే అంశంపై రెండు రోజులపాటు జరిగే అంతర్జాతీయ సదస్సు ప్రారంభమైంది. ముఖ్య అతిథులుగా పాల్గొన్న చైర్మన్, వైస్ చైర్మన్ మాట్లాడుతూ అటానమస్ హోదా కలిగిన కుప్పం ఇంజనీరింగ్ కళాశాలలో అధునాతన సాంకేతిక పద్ధతులపై జరిగే సదస్సులు విద్యార్థుల్లో అవగాహన పెంపొందిస్తాయని చెప్పారు. ఐఈఈఈ కంప్యూటర్ సొసైటీ హైదరాబాద్ ట్రెజరర్ డాక్టర్ కడియాల రమణ ప్రధాన వక్తగా హాజరై సాంకేతిక పరిజ్ఞానం సస్టైనబుల్ డెవలప్‌మెంట్‌లో పోషించే ప్రధాన పాత్ర పై వివరించారు. ప్రముఖ పరిశోధకులు, శాస్త్రవేత్తలు, పరిశ్రమ నిపుణులు, విభాగాధిపతులు పాల్గొని సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధిపై ఆలోచనలు పంచుకున్నారు. సదస్సులో కుప్పం ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.సుధాకర్‌బాబు, సెక్రటరీ ఎన్.సాగర్ రాజ్, వైస్ ప్రిన్సిపాల్ ఎస్.భాస్కరన్, ఆర్‌అండ్‌డీ డైరెక్టర్, ఈసీఈ విభాగాధిపతి జీఎస్.కోదండరామయ్య, సీఎస్ఈ విభాగాధిపతి, కో కన్వీనర్ కె.లోగేష్, ఈసీఈ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్, కో కన్వీనర్ పి.అజయ్ కుమార్ రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే లైసెన్సుల రద్దు


మాట్లాడుతున్న సుబ్బరాజు

పుంగనూరు , అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ సందర్భంగా తాత్కాలిక టపాకాయల దుకాణాల నిర్వహణపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వ్యాపారులకు అగ్నిమాపక అధికారి సుబ్బరాజు అవగాహన కల్పించారు. శుక్రవారం స్థానిక భగత్‌సింగ్‌కాలనీలోని అగ్నిమాపక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ దుకాణం వద్ద ఇసుక, నీరు నిల్వ ఉంచాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే లైసెన్స్‌లు రద్దు చేయడంతో పాటు వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పాఠశాలకు బీరువా, బల్లల వితరణ


పాఠశాలకు వితరణ చేస్తున్న దాతలు

కల్లూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం మంగళంపేట ఆదర్శ ప్రాథమిక పాఠశాలకు శుక్రవారం దాతలు శశిధర్, తాతయ్య, చక్రధర్, సుల్తాన్, హరిశంకర్, చంద్ర రూ.30 వేలు విలువైన బీరువా, బల్లలు హెచ్‌ఎం మోహన్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవోలు శిద్ధరామయ్య, తాతయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కుక్కల దాడుల్లో రెండు దూడలు, 20 కోళ్ల మృతి

రామకుప్పం/శాంతిపురం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): శాంతిపురం పట్టణంలో గురువారం అర్ధరాత్రి నారాయణనాయుడు, ప్రభాకర్‌నాయుడులకు చెందిన పశువుల కొట్టాలపై కుక్కల గుంపు ఒక్కసారిగా దాడులు చేయడంతో రెండు దూడలు, 20 కోళ్ల మృతిచెందాయి. అధికారులు స్పందించి కుక్కల బెడద నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

నీట మునిగిన పంటలు


ముసలిమడుగు వద్ద మునిగిన వరిమడి

పలమనేరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): పలమనేరు మండలంలో గురువారం రాత్రి భారీ వర్షం కురిసింది. మండలంలో 41.8 మిల్లీమీటర్ల వర్షం కురవడంతో ముసలిమడుగు గ్రామ సమీపంలోని చెరువు, కుంటలు నిండి కలుజు పారడంతో ఆయకట్టులోని పంట పొలాల్లో నీరు నిలిచిపోయాయి. దీంతో రైతులు తమ పంటలు భారీ వర్షాల కారణంగా నీట మునిగి పోయాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామానికి చెందిన రవీంద్రారెడ్డి, చంద్రశేఖర్ నాయుడు, రేవతిలకు చెందిన పంటలు నీట మునిగాయి. అధికారులు స్పందించి పంటల్లోకి నీరు రాకుండా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

బైరెడ్డిపల్లె చెరువుకట్ట పరిశీలన

బైరెడ్డిపల్లె, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): బైరెడ్డిపల్లె పెద్దచెరువుకట్టను శుక్రవారం తహసీల్దార్ ప్రసన్నకుమార్, ఇరిగేషన్ అధికారులతో కలిసి టీడీపీ మండలాధ్యక్షుడు కిశోర్‌గౌడు పరిశీలించారు. చెరువులో లీకేజీలను పరిశీలించి చెరువుకట్టపై ఉన్న పిచ్చిమొక్కలను తొలగించేందుకు చర్యలు తీసుకున్నారు.

దేవళంపేటలో ఏర్పాట్లను పరిశీలించిన ఎంపీ


నేతలకు సూచనలిస్తున్న ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు

వెదురుకుప్పం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం మండలం దేవళంపేటకు హోంమంత్రి అనిత శనివారం వస్తున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం దేవళంపేటకు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు చేరుకుని కూటమి నాయకులతో కలసి ఏర్పాట్లను పరిశీలించారు. అలాగే ఇక్కడ జరగనున్న బహిరంగ సభపై జీడీనెల్లూరు టీడీపీ మండల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, దళిత సంఘాల నేతలతో సమాలోచనలు చేశారు. ఎమ్మెల్యే థామస్ వ్యక్తిగత కార్యదర్శి చంద్రశేఖర్, టీడీపీ జిల్లా ప్రధానకార్యదర్శి కోదండయాదవ్, క్లస్టర్ ఇన్‌చార్జి పి.మోహన్‌మురళి, టీడీపీ నేత సాతల గుణశేఖర్, పెనుమూరు టీడీపీ మండల అధ్యక్షుడు రుద్రయ్యనాయుడు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు తలారి రెడ్డెప్ప, కార్జాల అరుణ, తదితరులు పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యమూ ముఖ్యమే

చిత్తూరు రూరల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): శారీరక ఆరోగ్యంతోపాటు మానసిక ఆరోగ్యమూ ముఖ్యమేనని జిల్లా లీగల్ సెల్ అథారిటీ కార్యదర్శి భారతి అన్నారు. శుక్రవారం చిత్తూరు డీఎంహెచ్‌వో కార్యాలయంలో ప్రపంచ మానసిక దినం సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రోగ్రామ్ ఆఫీసర్లు హనుమంతరావు, గిరి, ప్రవీణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మహిళ మృతి కేసులో నిందితుడి అరెస్టు

పెనుమూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఓ మహిళ మృతి కేసులో నిందితుడిని అరెస్టు చేశారు. జట్టిగుండ్లపల్లె పెట్రోల్ బంకు వద్ద గత నెల 19వ తేదీన రోడ్డుపై వస్తున్న కృష్ణవేణి(55)ని ఓ వాహనం ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడ్డ ఆమెను తిరుపతి రుయాలో చేర్పించగా పది రోజులకు మృతి చెందింది. దీనిపై ఎస్‌ఐ వెంకటనరసింహులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆమెను ఆటోతో ఢీకొట్టినట్లు పెట్రోల్ బంకు సీసీ కెమెరాలో రికార్డు అయ్యింది. ఈ క్రమంలో జట్టిగుండ్లపల్లె దళితవాడకు చెందిన చిన్నబ్బ కుమారుడు నందమారుతీ అలియాస్ మస్తాన్ తానే ఆటోతో ఢీకొట్టినట్లు పోలీసుల ఎదుట లొంగిపోవడంతో అరెస్టు చేశారు.

17 ఎకరాల ప్రభుత్వ భూమి స్వాధీనం

గంగాధరనెల్లూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): నల్లరాళ్లపల్లె వద్ద ప్రైవేటు వ్యక్తుల నుంచి 17 ఎకరాల ప్రభుత్వ భూమిని రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. నల్లరాళ్లపల్లె వద్ద సర్వేనెంబర్ 13లో 17 ఎకరాల భూమి రెవెన్యూ రికార్డుల ప్రకారం అనాధీనం ప్రభుత్వ భూమిగా ఉందని గుర్తించారు. ఈ భూమి ప్రైవేటు వ్యక్తుల ఆధీనంలో ఉండటంతో శుక్రవారం దాన్ని స్వాధీనం చేసుకుని, హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, మండల సర్వేయర్ గణేష్, సచివాలయం సర్వేయర్ భారతి పాల్గొన్నారు.

ట్రైనీ ఎస్‌ఐల బాధ్యతల స్వీకరణ

వెదురుకుప్పం, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం ట్రైనీ ఎస్‌ఐగా రమేష్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన్ను టీడీపీ మండల అధ్యక్షుడు చెంగ్రాయులయాదవ్, నాయకులు వి.రాజా, హేమంత్‌రెడ్డి, బాలాజీ సన్మానించారు.

నింద్ర: ట్రైనీ ఎస్‌ఐగా మల్లికార్జున్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గంజాయి, ఇసుక వంటివి అక్రమంగా తరలిస్తుంటే సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు.

నగరిలో జీఎస్టీ మెగా ఎగ్జిబిషన్

నగరి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జీఎస్టీ 2.0 మెగా ఎగ్జిబిషన్ నిర్వహించారు. కమిషనర్ కృష్ణారెడ్డి, జీఎస్టీ డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ పూర్ణంలు ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. ఎంపీడీవో వాణి, మెప్మా సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, నగరి మున్సిపల్ టీడీపీ అధ్యక్షుడు గుణశేఖర్, కుప్పయ్య శెట్టి, జనసేన నాయకురాలు కోమల పాల్గొన్నారు.

'పీజీఆర్ఎస్'కు 24 అర్జీలు

చిత్తూరు సిటీ, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన పీజీఆర్ఎస్ (ప్రజా సమస్యల పరిష్కార వేదిక)కు 24 అర్జీలు వచ్చాయి. మున్సిపల్ ఇంజనీర్ వెంకటరామి రెడ్డి అర్జీలను స్వీకరించారు. కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. మిగిలినవి క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరిస్తామని చెప్పారు. డిప్యూటీ తహసీల్దార్ ఇబ్రహీం, డీఈ వెంకటరమణ, హౌసింగ్ డీఈ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు సహకరించాలి

పూతలపట్టు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు సహకరించాలని ఎంపీడీవో నాగరాజ్ కోరారు. ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో శుక్రవారం ఎంపీపీ కుమారి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమావేశానికి కిందిస్థాయి అధికారులే రావడం సరికాదన్నారు. కొంతమంది సభ్యులు గ్రామీణ ప్రాంతాలకు సక్రమంగా విద్యుత్ సరఫరా చేయడంలేదని ధ్వజమెత్తారు. జడ్పీటీసీ దేవిక తదితరులు పాల్గొన్నారు.

జోరువాన

పొంగిన వాగులు, వంకలు ● ఇళ్లు, బడుల్లోకి చేరిన వర్షపునీరు
దెబ్బతిన్న రోడ్లు, వంతెనలు ● జలమయమైన పొలాలు
రాకపోకలకు తీవ్ర ఇబ్బంది పడ్డ జనం



మాధవరంలో నీటమునిగిన వరి - క్షూరికాపురం ఆదిఆంధ్రవాడ వద్ద తారురోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

పొలాలు జలమయం

విజయపురం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో గురవారం అర్ధరాత్రి వర్షం ముంచెత్తింది. సుమారు 3 గంటలకుపైగా ఎడతెరపి లేకుండా ఉరుములు మెరుపులతో వర్షం కురవడంతో పంట పొలాలు జలమయమయ్యాయి. క్షూరికాపురం ఆదిఆంధ్రవాడ వద్ద వర్షపునీరు రోడ్డుపై నీరు పారడంతో స్థానికులు ఇబ్బంది పడ్డారు.

యాదమరిలో చెరువులకు జలకళ


మొరవపారుతున్న కీనాటంపల్లె కొత్తచెరువు

యాదమరి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): యాదమరి మండలంలో గురువారం రాత్రి భారీస్థాయిలో వర్షం కురిసింది. చెరువులు జలకళను సంతరించుకున్నాయి. కీనాటంపల్లె పంచాయతీలోని కొత్తచెరువు మొరవ పారడంతో కోయివూరుకు వెళ్లడానికి దారి లేకుండా పోయింది. మొరవను తహసీల్దార్ పార్థసారథి, ఎస్‌ఐ ఈశ్వర్ పరిశీలించి అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా డీకే చెరువు పాఠశాలలోకి మోకాళ్లలోతు వరకు నీరు చేరింది. హెచ్‌ఎం.. గ్రామస్తుల సహకారంతో నీటిని కాలువల ద్వారా మళ్లించారు. జొన్నవాళ్ళమిట్ట వద్ద నీవానది కాజ్‌వే రహదారిపై ప్రవాహం జోరుగా సాగడంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. మండలకేంద్రంలోని త్రివేణి సంగమం వద్ద నీవానది ఉధృతంగా ప్రవహించి చిత్తూరు నగరం వైపు ఉరకలెత్తింది. బోదగుట్టపల్లె పంచాయతీ పెరగాండ్లపల్లెలో నాగయ్యకు చెందిన పూరిల్లు కూలిపోయింది.

పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు


క్షీరసముద్రం, జీఎంఆర్‌పురం మధ్య వాగులో నీటి ప్రవాహం

శ్రీరంగరాజపురం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎస్ఆర్‌పురం మండలంలో గురువారం రాత్రి కురిసిన వర్షానికి వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. జీఎంఆర్‌పురం, వడ్డికండ్రిగ, దాసరిగుంట, పాత పాళ్యం, డీ.కె. కండ్రిగ, మిట్టకండ్రిగ, ఎగువకమ్మ కండ్రిగ గ్రామాలవారి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఇక్కడ వంతెన నిర్మించాలని ఎమ్మెల్యే థామస్ దృష్టికి స్థానికులు తీసుకెళ్లారు. వంతెన నిర్మిస్తామని హామీ ఇచ్చారు. అలాగే జిల్లా అధికారులకు ఫోన్లో మాట్లాడి, స్థానికులు ఇబ్బంది పడకుండా సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. కాగా, ఎస్ఆర్‌పురం మండలంలో అత్యధికంగా 154 మి.మీ. వర్షపాతం నమోదైంది. తయ్యారు గ్రామానికి రామకృష్ణ వేరుశనగ పంట పూర్తిగా నీటిలో మునిగింది. వరి నేల వాలింది.

గుడిపాలలో కొట్టుకుపోయిన బ్రిడ్జి


ధర్మరాజులపురం వద్ద ఇంట్లోకి చేరిన వర్షపునీరు

గుడిపాల, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): గుడిపాల మండలంలో గురువారం రాత్రి భారీ వర్షం కురిసింది. దళితవాడ నుంచి గోళ్లతిమ్మయ్యకండ్రిగ మార్గమధ్యలో ఉన్న వంకపై గతంలో నిర్మించిన వంతెన కొట్టుకుపోవడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలిగింది. ఈవిషయాన్ని సర్పంచ్ మోహన్ తహసీల్దార్ శ్రీనివాసులుకు తెలియజేశారు. ఆయన తన సిబ్బందితో వచ్చి యంత్రాల ద్వారా వేరే దారిని ఏర్పాటు చేశారు. గుడిపాల అరుంధతి వాడలో ఉన్న చెరువు మొరవ ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ప్రజలకు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు. ధర్మరాజులపురం వద్ద ఉన్న చెరువు కలుజు విపరీతంగా పారడంతో అక్కడున్న ఓ ఇంట్లోకి నీరు చేరింది. విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగింది. తహసీల్దార్ కార్యాలయంలోని కంప్యూటర్లు, ఎంపీడీవో కార్యాలయంలో షార్టు సర్క్యూట్ జరిగి ఫ్యాన్లు కాలిపోయాయి. పాళ్యం ఆంజినేయ స్వామి ఆలయం వద్ద పెద్ద గుండు దొర్లుకొచ్చి ఆలయానికి వెళ్లే మార్గంలో ఉన్న మెట్లు దెబ్బతిన్నాయి.

ఉప్పొంగిన కుశస్థలీ నది


కీళపట్టు వద్ద వంతెనపై పారుతున్న నీరు

నగరి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): కృష్ణాపురం డ్యాం నిండటంతో గేట్లు తెరిచారు. దాంతో కుశస్థలీ నదిలో నీరు ఉప్పొంగి పారింది. కీళపట్టు లోతట్టు వంతెనపై నీరు పెద్ద ఎత్తున పారుతుండడంతో రాకపోకలను నిషేధించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: థామస్

వెదురుకుప్పం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): వర్షాలు కురుస్తుండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గంగాధరనెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ వీఎం థామస్ ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఎస్ఆర్‌పురం మండలం కమ్మకండ్రిగ పంచాయతీ పరిధిలో గురువారం రాత్రి కురిసిన వానతో వంతెన పూర్తిగా దెబ్బతినడంతో మూడు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయని తెలిపారు. కలెక్టరు, సంబంధిత అధికారులతో చర్చించి శాశ్వత వంతెన నిర్మాణం పనులు త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు. ప్రజల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

ఎన్టీఆర్ జలాశయం నుంచి 350 క్యూసెక్కుల నీటి విడుదల

పెనుమూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): పెనుమూరు మండలంలోని కలవగుంట వద్ద ఉన్న ఎన్టీఆర్ జలాశయం రెండు గేట్ల నుంచి 350 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. రెండ్రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో జలాశయానికి భారీగా నీరు చేరడంతో దిగువకు నీటిని విడుదల చేసినట్లు జలవనరులశాఖ ఏఈ భరత్ తెలిపారు. వాహనాలకు బ్రిడ్జిపై మళ్లించినట్లు పేర్కొన్నారు.




ఆత్మకూరు - నరసింగరాయునిపేట వద్ద నీవానది ప్రవాహం - మహదేవమంగళంలోని స్కూలులోకి చేరిన వర్షపునీరు - మొరవ పారుతున్న గరిగలపల్లె చెరువు

నీవానదిలో పెరిగిన నీటిప్రవాహం

గంగాధరనెల్లూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): గంగాధరనెల్లూరు మండల పరిధిలోని నీవానది ప్రవాహం రోజు రోజుకూ పెరుగుతోంది. పలు చెరువులు నిండి మొరవలు పారుతున్నాయి. తూగుండ్రం చెరువు మొరవనీళ్లు తూగుండ్రం - వేణుగోపాలపురం వద్ద తారురోడ్డుపై జోరుగా ప్రవహించింది. ఎల్లాపల్లె చెరువు మొరవసాగడం వల్ల గంగాధరనెల్లూరు - అంబోధరపల్లె రహదారిలో శుక్రవారం ఉదయం 11 గంటల వరకు రాకపోకలు స్తంభించాయి. కలిజవేడు పంచాయతీ బొమ్మవారిపల్లె వంక, వేల్కూరు వద్ద చిట్టేరు వంకసైతం జోరుగా సాగింది. మహదేవమంగళం చెరువునిండి మొరవనీళ్లు దగ్గరలోని ఎలిమెంటరీ స్కూల్లోకి వచ్చి, పక్కనున్న పొలాల్లోకి పారుతున్నాయి. తహసీల్దార్ శ్రీనివాసులు, వీఆర్వో రూహి ఫాతిమా స్కూల్ వద్దకొచ్చి, పరిస్థితిని సమీక్షించారు.


నీళ్లలో నిలబడి నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

కుటుంబానికి రూ.10వేలివ్వాలి: సీపీఐ

చిత్తూరు రూరల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): తేనబండలో వరద కారణంగా నీట మునిగిన కుటుంబాలకు రూ.10వేల ఆర్థిక సాయం అందించాలని సీపీఐ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నీట మునిగిన నీవానది పరివాహక ప్రాంతాన్ని శుక్రవారం వారు పరిశీలించి, నిరసన తెలిపారు. వెంటనే తేనబండ బ్రిడ్జిని నిర్మించాలని డిమాండ్ చేశారు. ఇక్కడున్నవారికి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. నాయకులు నాగరాజు, మణి, గోపీనాథ్, రఘు తదితరులు పాల్గొన్నారు.

కాణిపాక ఆలయ బోర్డు మెంబరుకు సన్మానం



ఐరాల, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయ ట్రస్టు బోర్డు సభ్యుడిగా ఎంపికైన పెరుమాళ్ల సుబ్బారెడ్డిని శుక్రవారం వైఎస్ గేటులో టీడీపీ, బీజేపీ నాయకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో బంగారుపాళ్యం ఏఎంసీ వైస్ చైర్మన్ నరిగన్నగారిసుధాకర్, మండల బీజేపీ నాయకుడు అయిరాల రాజేష్‌రెడ్డి, టీడీపీ నాయకులు అయిరాలరంజిత్‌రెడ్డి, వాసుదేవరెడ్డి, లోకనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గంజాయిపై ప్రత్యేక దృష్టి పెట్టండి: డీఎస్పీ

గుడిపాల, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సరిహద్దు ప్రాంతంలో గుడిపాల ఉండటంతో గంజాయిపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాలని చిత్తూరు డీఎస్పీ సాయినాథ్ అన్నారు. శుక్రవారం నరహరిపేట పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. గ్రామాల్లో భూతగాదాలు, మద్యం అక్రమ రవాణా, గంజాయి తరలింపు వంటి వాటిపై నిఘా పెట్టాలని ఆదేశించారు. వెస్టు సీఐ శ్రీధర్‌నాయుడు, ఎస్‌ఐ రామ్మోహన్, ఏఎస్‌ఐ రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెరగాలి


విద్యార్థికి జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందజేసిన చంద్రమోహన్

చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో ఆత్మ విశ్వాసం పెరగాలని ప్రముఖ మెంటార్, ట్రైనర్ ఎస్.చంద్రమోహన్ అన్నారు. విజయం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో విజయం విద్యాసంస్థల అధినేత తేజోమూర్తి, అకడమిక్ డైరెక్టర్ శైలజామూర్తి సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం కళాశాలలో ఫ్రెషర్స్ డే నిర్వహించారు. యంగ్ మైండ్, టేక్ ఆఫ్ ఎడ్యూ గ్రూప్ వ్యవస్థాపకుడు, సీఈవో వినయ్ అంగలకూడి, తేజోమూర్తి, శైలజామూర్తిలు విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ప్రతిభ చూపిన విద్యార్థులను ప్రశంసా పత్రాలు అందజేశారు. కళాశాల అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పీపీపీ విధానాన్ని రద్దు చేయాలి: వైసీపీ

వెదురుకుప్పం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాలల నిర్మాణానికి పీపీపీ విధానాన్ని రద్దు చేయాలని గంగాధరనెల్లూరు వైసీపీ సమన్వయకర్త కృపాలక్ష్మి డిమాండ్ చేశారు. శుక్రవారం కార్వేటినగరం మండలంలోని దాసరిగుంట, సురేంద్రనగరంలో రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల నుంచి సంతకాల సేకరణ చేశారు.

గజ-ప్రజ యాప్ రైతులకు ఉపయోగపడాలి

చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అటవీ శాఖ నూతనంగా ఆవిష్కరించిన గజ-ప్రజ యాప్ అటవీ సరిహద్దు ప్రాంతాల ప్రజలు, రైతులకు ఉపయోపడాలని వైల్డ్ లైఫ్ ఎక్స్‌పర్ట్ రాకేష్ కాల్వ సూచించారు. శుక్రవారం యాప్‌పై డీఆర్వో మోహన్ కుమార్ ఆధ్వర్యంలో అటవీ, వ్యవసాయ, ఉద్యాన శాఖాధికారులకు గూగుల్ మీట్ ద్వారా అవగాహన కల్పించారు.

కలప లారీ సీజ్



చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా కలపను తరలిస్తున్న ఓ లారీని అటవీ శాఖ అధికారులు గురువారం సీజ్ చేశారు. కర్ణాటక నుంచి శ్రీకాళహస్తికి ఎలాంటి అనుమతి లేకుండా మామిడి, చిగరను అక్రమంగా తరలిస్తుండగా, బంగారుపాళ్యం మొగిలి వెంకటగిరి వద్ద అటవీ సెక్షన్ అధికారులు పట్టుకున్నారు. లారీని సీజ్ చేసి, వెస్టు రేంజ్ కార్యాలయానికి తరలించారు. ఎఫ్ఆర్వో పట్టాభి.. లారీ యజమానికి రూ.40వేల జరిమానా విధించినట్లు శుక్రవారం తెలిపారు.

వరకట్న వేధింపుల కేసులో నిందితుడికి ఏడాది జైలు

చిత్తూరు లీగల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): వరకట్న వేధింపు కేసులో నిందితుడికి ఏడాది జైలు, జరిమానా విధించారు. 2012 నవంబరు 26వ తేదీన చిత్తూరు కొంగారెడ్డిపల్లెకి చెందిన స్నేహలత తన భర్త మోహన ప్రసాద్, అతడి తల్లి, పిన్నమ్మ వేధింపులకు గురిచేస్తున్నారని మహిళా పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ కేసు మూడో అదనపు మేజిస్ట్రేట్ కోర్టులో వాయిదాకు రాగా.. మోహన్‌ప్రసాద్‌పై నేరం రుజువైంది. దాంతో అతడికి ఏడాది జైలు, రూ.2వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి శిరీష తీర్పుచెప్పారు.

భవిత కేంద్రంలో పిల్లలకు ప్రత్యేక బోధన ఉపకరణాల కిట్లు పంపిణీ

తవణంపల్లె, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): తవణంపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో ఉన్న భవిత కేంద్రంలోని ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు అలింకో సహకారంతో సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ప్రత్యేక బోధన ఉపకరణాల కిట్లు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన టీడీపీ మండల అధ్యక్షుడు వెంకటేష్ చౌదరి మాట్లాడుతూ.. భవిత విద్యార్థులకు అవసరమైన భవనం నిర్మాణంకు నిధులు తమ కుటుంబం తరఫున అందిస్తానన్నారు. అనంతరం ఉన్నత పాఠశాల విద్యార్థులకు సెమిస్టర్-2 పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. ఎంఈవో హేమలత, టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు గాలి దిలీప్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రతి గర్భిణికి సహజ కాన్పు జరగాలి

ఐరాల, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రతి గర్భిణికి సహజ కాన్పు జరిగేలా చేయాలని ఐరాల పీహెచ్‌సీ డాక్టర్ రెడ్డెప్ప అన్నారు. శుక్రవారం పీహెచ్‌సీలో పీఎంఎస్ఎంఎస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వేలూరు సీఎంసీ నుంచి ఐసీఎంఆర్ టీమ్ జ్యోతిర్మయ, శంకరి విచ్చేసి ఎస్సీడీపైఆశావర్కర్లకు అవగాహన కల్పించారు. వైద్యుడువెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

న్యాయవాదుల నిరసన

నగరి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌పై చెప్పుతో దాడికి ప్రయత్నించడం విచారకరం అని నగరి జూనియర్ సివిల్ జడ్జి, జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు ఆవరణలో న్యాయవాదులు శుక్రవారం నిరసన తెలిపారు. నగరి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వేలాయుధం, కోశాధికారి నాగరాజన్, సెక్రటరీ జాన్‌జోష్, జాయింట్ సెక్రటరీ తిరుమలై, ట్రెజరర్ అరుణ్ పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

